శ్రీనివాసా బుక్ స్టాల్
ప్రొ॥ కె. యస్. వి. శ్రీనివాస్
మొగల్తూరు. బుక్ సి. నెం.

# యుద్ధం

'ఢిల్లీ నుంచి వస్తున్న విమానం మరో 5 నిముషాల్లో లాండ్ అవబోతోంది'

మైక్‌లోనుంచి హిందీలోనూ, ఇంగ్లీషులోనూ ఎనౌన్స్‌మెంట్ వినిపించింది! ఎయిర్‌పోర్ట్ లౌంజ్‌లో, సోఫాలో కూర్చునివున్న నేను చటుక్కున లేచాను.

'మమ్మీ! ప్లేన్ వచ్చేస్తోందా?' నాతోపాటు లేచిన సంజయ్ నా చీర కుచ్చెళ్ళని గట్టిగా పట్టుకుంటూ అడిగాడు.

నేను తల వూపుతూ చప్పున వాడిని ఎత్తుకున్నాను. నా గుండెలు వేగంగా, కొట్టుకోసాగినాయి. ఒక్కసారి కళ్ళదించి, నేను ధరించిన చీర వైపు చూశాను. విజయ్‌కి ఎంతో యిష్టమైన చీర! లేతపసుపురంగుమీద ఆకుపచ్చ చుక్కలతో, అందమైన లతలు బార్డరుగావున్న కాశ్మీర్‌సిల్కుచీర. విజయ్‌ని పంపేరోజున యిదే చీర కట్టుకున్నాను. మళ్ళీ మూడుసంవత్సరాల తర్వాత యీనాడు పెట్టిలోనుంచి తీశాను. నా కళ్ళలో చివ్వున నీళ్ళు కమ్ముకున్నాయి! మళ్ళీ యీచీర కట్టుకునే అదృష్టం యీ జన్మకి వుంటుందాని భయపడిన క్షణాలు గుర్తుకు వచ్చినాయి. విజయ్ వెళ్ళేరోజు యిప్పటికీ గుర్తుంది. నామనసు గతంలోకి పరుగులు తీసింది.

ఆ రోజు —

మధ్యాహ్నం భోజనానికి వచ్చిన అతను సాయంత్రం బైలుదేరాలని చెప్పాడు. అప్పటికి సంజయ్ 12 రోజుల పసికందు ! 13 వ రోజున నామకరణం చాలా ఘనంగా చేయాలని వుత్సాహపడుతూ అందరినీ పిలిచాం. అమ్మ వంటబ్రాహ్మణులని పిలిచి, మర్నాడు ఏమేమి పిండివంటలు వేయాలో సంప్రదిస్తుంటే, ఆసక్తిగా వింటూ నిలబడిన నన్ను విజయ్ యింటికి రాగానే, 'యిలారా' అంటూ పడకగదిలోకి పిలిచి 'బారసాల ఆగిపోయినట్టుగా అందరికీ కబురు చెయ్యి. నేను వూరువెడ్తున్నాను' అని చెప్పగానే, నేను నీళ్ళుకారిపోయాను.

మరోగంట, మాయిల్లంతా, విజయ్ ప్రయాణం గురించిన చర్చతో నిండిపోయింది. అతను భోజనం చేశానని అనిపించినట్టుగా, గబ గబా తిని లేచాడు. ప్రతిరోజూ యిద్దరం కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుతూ, తుళ్ళుతూ, ఒకరికి ఒకరు కొసరి కొసరి వడ్డించుకుంటూ తినేవాళ్ళం. ఈరోజు ఆమాటలే మర్చిపోయినట్టుగా, చేతులు కడిగేసి లేచి వెళ్ళిపోయాడు. విజయ్ సాయంత్రం వెళ్ళిపోతున్నాడు. అతనే చక చకా కావాల్సినవన్నీ పెట్టెలో సర్దుకున్నాడు. పెట్టె సర్దుకుంటూనే, నాకు చెప్పాల్సిన జాగ్రత్తలూ, అప్పగింతలూ చెప్పాడు.

నేను కాళ్ళూ, చేతులూ ఆడనట్టుగా, వుయ్యాల తొట్టెని ఆనుకుని విమూఢురాలిలా చూస్తూ నిలబడ్డాను.

పెట్టెకి తాళం వేస్తున్న విజయ్ ఎందుకో తలెత్తి చూసినవాడల్లా క్షణం ఆగాడు. నా ముఖంలో అతనికి ఏం కనిపించిందో ఏమో, వెంటనే చేస్తున్న పని ఆపి, నాదగ్గరగా వచ్చాడు.

'రాధా ! నేను నిన్ను పెళ్ళి చేసుకోవటానికి ముందు మీ మామయ్య యింట్లో మేడమీద చెప్పిన మాటలు గుర్తున్నాయా ?' కళ్ళలోకి వెతుకుతూ అడిగాడు.

నేను తలవూపాను. ఎందుకు గుర్తులేదు. బాగానే గుర్తున్నాయి.

'రాధా ! నేను మిలటరీలో పనిచేస్తున్నాను. నాతో పెళ్ళి అంటే నువ్వు జీవితంతో జూదం ఆడినట్టే ! ఏక్షణంలోనైనా నేను నిన్ను వదిలి వెళ్ళాల్సి

వస్తుంది. నెలల తరబడి నువ్వు ఒంటరిగా వుండాల్సి వస్తుంది! మృత్యువుకి నేను అతి సన్నిహితంగా వుంటాను.

నువ్వు చదువుకున్నదానివి! బాగా ఆలోచించుకో!' అన్నాడతను.

'జీవితానికి స్థిరత్వం ఏముంది? మృత్యువుకి యుద్ధరంగమే కానవసరంలేదు. మా పిన్ని కూతురు భర్త రెండురోజులు జ్వరంతో పోయాడు. దానికేం చెప్పగలం?' అన్నాను. నామాటలు వినగానే అతని కళ్ళలో ఆనందం, ప్రశంసలులాటివి కన్పించాయి.

ఆ సంభాషణ యిప్పుడు అతనికికూడా గుర్తుకువచ్చినట్టుంది. నన్ను దగ్గరకు తీసుకున్న విజయ్ తగ్గుస్వరంతో అన్నాడు. 'రాధా! నేను వెళుతున్నాను. ఒకవేళ — ఒకవేళ నేను తిరిగి రాకపోతే, నువ్వు మనిద్దరం కలిసి గడిపిన జీవితాన్ని ఒక కలలా మర్చిపో! వేరే పెళ్ళిచేసుకో!'

నేను అతన్ని కోపంగా, దూరంగా తోశాను. వేలుపెట్టి పక్కనే వుయ్యాలలోవున్న పసికందుని చూపిస్తూ 'వాడిని చూసి అయినా నువ్వు యిలా మాట్లాడకూడదు' అన్నాను.

విజయ్ కళ్ళు బాబుమీద నిల్చినాయి. దగ్గరికివెళ్ళి మెత్తటిపక్కమీద ఒదిగి నిద్రపోతున్న వాడిచేయి పట్టుకున్నాడు. 'సంజయ్' అంటూ వాడి గుప్పెట బలవంతంగా తెరిచి, అరచేతిలో తన చూపుడువ్రేలితో వ్రాశాడు.

'రాధా! బాబుకి నామకరణం చేసేశాను' అన్నాడు. తర్వాత తగ్గు స్వరంతో, 'రాధా! నేను చాలా మారిపోయాను. ఎంత మొండిగా వుండేవాడిని! సెంటిమెంట్స్ వున్నవాళ్ళనిచూసి ఒట్టి ఫూల్స్ అనుకునేవాడిని! ఇప్పుడు నేనే ఒక పెద్ద సెంటిమెంటల్ ఫూల్‌ని అయాను. ఒకవేళ నేను తిరిగి రాకపోతే నా ఆత్మకి శాంతి వుండదేమో?'

'మళ్ళీ అదేమాట! ఆ మాట తప్ప నీకు యింకేం దొరకలేదా? నువ్వు తిరిగివస్తావు! వస్తావు! వస్తావు!' ఆవేశంతో గట్టిగా అన్నాను.

'థాంక్ యూ! రాధా! నిన్ను చూసిన తర్వాత పెళ్ళి చేసుకోకూడదు అనే నా నిర్ణయమే మారిపోయింది. సంజయ్ జాగ్రత్త! వాడిని నీకు, నిన్ను దేవుడికి అప్పచెప్పి వెళుతున్నాను.'

అతను ఒక్కక్షణం నన్ను తేరిపార చూశాడు. 'రాధా! చెవుల్లో దూది, నడుంకి కట్టు, బాలింతతనంతో మెరుస్తున్నకళ్ళు, తాంబూలంతో ఎర్రబడిన పెదవులు, నీ యీ రూపమే నాకు గుర్తుంటుంది' నేను యిక అతనికి దూరంగా నిలబడలేకపోయాను.

అమ్మావాళ్ళు, 'నువ్వు పచ్చి బాలింతరాలివి, చలిగాలి బాగా వేస్తోంది వద్దు' అంటున్నా వినకుండా, విజయ్‌ని పంపటానికి నేనుకూడా స్టేషన్‌కి వెళ్ళాను. విజయ్‌కూడా యెందుకోగాని నన్ను గట్టిగా, రావద్దని శాసించలేదు. 'స్వెట్టర్ వేసుకుని, తలకి స్కార్ఫ్ కట్టుకో చలిగాలి వేస్తోంది' అన్నాడు. కారులో సామాను సర్దాం. 'నువ్వు డ్రైవ్ చెయ్యి' అన్నాడు విజయ్. నావల్లకాదు అన్నట్టు తల తిప్పాను. విజయ్ తనే వచ్చి స్టీరింగ్‌దగ్గర కూర్చున్నాడు. అమ్మ, మామయ్య, విజయ్ తమ్ముడు రమణ వెనక కూర్చున్నారు.

ఆరోజు వీళ్ళ ట్రూప్ అంతా వెళుతోందికాబోలు! ఆ రైలు మొత్తం అంతా యీ మిలట్రీవాళ్ళే వున్నారు. ప్లాట్‌ఫారం అంతా యూనిఫారం ధరించిన విజయ్‌లాటివాళ్ళతో, వాళ్ళని పంపటానికి వచ్చిన మాలాటివాళ్ళతో కిటకిటలాడుతోంది.

'ఈ రైలు ఎక్కడికి వెళుతుంది' అన్నాడు మామయ్య.

'తెలియదు. ఎక్కడో ఒకచోట, వేరే ట్రైన్ వీళ్ళని అందుకుంటుంది. అక్కడనుంచి, సరిహద్దుల్లోవున్న రక్షణ స్థావరాలకి వెళ్ళిపోతారుట' అన్నాడు రమణ.

విజయ్‌ని పంపటానికి అతని స్నేహితులుకూడా వచ్చారు.

విజయ్ వాళ్ళతో నవ్వుతూ, తుళ్ళుతూ, జోక్ చేస్తున్నట్టుగా మాట్లాడుతున్నాడు. ట్రైన్ బైలుదేరబోతున్నట్టుగా, విజిల్ వేసింది. పెట్టెలో యెక్కబోతున్న విజయ్ అందరితో చెప్పి, ఆఖరిసారిగా నావైపు తిరిగాడు.

'రాధా!' హఠాత్తుగా అతని రెండుచేతులూ నాభుజాల్ని గుచ్చి పట్టుకున్నాయి. ఏదో చెప్పాలన్నట్లుగా, అతని పెదవులు అస్పష్టంగా కదిలాయి.

మాయిద్దరి ముఖాల్లోనూ, యిదే ఆఖరి చూపేనేమోననే భయం! మనసుల్లో యిదే ఆఖరి స్పర్శేనేమోననే వెరపు! .

ఒకరిని ఒకరు మళ్ళీ చూడగలమా అనే సంకోచం!

ఆ క్షణంలో — నా రెండు భుజాల్ని గుచ్చిపట్టుకున్న అతని చేతుల్ని మణికట్లదగ్గర, నేనుకూడా వదలలేనట్టుగా, గట్టిగా పట్టుకున్నాను. అతని స్పర్శని, చూపుల్ని, నా గుండెల్లో చిరస్మరణీయంగా, ఎన్నటికీ చెరగనంత స్థిరంగా, దాచుకోవటానికి వెర్రిప్రయత్నం చేస్తున్నదానిలా నిలబడ్డాను.

నాకళ్ళనిండా, చివ్వున నీళ్లు వుబికినాయి.

'ఏయ్ రాధా! ధైర్యంగా వుంటానని, నాకు మాట యిచ్చావు. ఆ సంగతి అప్పుడే మర్చిపోతున్నావ? ఏది? గివ్ మీ యువర్ స్మైల్! ఊఁ' డగ్గుత్తికతో, తగ్గుస్థాయిలో అన్నాడు.

కళ్ళనీళ్ళని బిగబట్టుకుంటూ మనస్ఫూర్తిగా నవ్వడానికి ప్రయత్నించాను. నా పెదవులు నవ్వినమాట నిజమే. కానీ నా కళ్ళు ఏడుపుని ఆపుకోలేకపోయినాయి.

మా పెళ్ళి అయి, ఇంకా సంవత్సరంకూడా నిండలేదు.

ఈ 11 నెలల్లో, వివాహజీవితం అంటే, స్వర్గం అనిపించేలా చేశాడతను. నన్ను కావాలని చేసుకున్నాడు. నలుగురిలో నేను చాలా అదృష్టవంతురాలిని అనిపించేలా చేశాడు. భగవంతుడు యీ జీవితంలో నీకేం వరం కావాలంటే, జన్మజన్మలకీ యితనికి భార్య అయ్యే అదృష్టం యివ్వమని కోరుకునేలా చేశాడు.

ట్రెయిన్ కదిలింది. విజయ్ అందులో ఎక్కి కూర్చున్నాడు. చాచిన అతని కుడిచెయ్యి వీడ్కోలుగా వూపుతుంటే దానికి నేను పెళ్ళిలో పెట్టిన వజ్రపుటుంగరం, లైట్లకాంతిలో మరింతగా మెరవసాగింది.

ట్రెయిన్ కనిపించనంతదూరం వెళ్ళిపోయింది. నాకెంతో ప్రియమైన విజయ్‌ని తీసుకుని వెళ్ళిపోయింది. నేను స్థాణువులా యింకా అలాగే నిబడిపోయాను.

'రాధా! వెళదాం రా' అమ్మ తట్టి పిలుస్తుంటే యీ లోకంలోకి వచ్చినట్టుగా అమ్మవైపు తిరిగాను. ఆ కళ్ళలో బాధ, సానుభూతి వున్నాయి. నేను ఒక్కసారిగా అమ్మ భుజం పట్టుకుని బావురుమని, కరువుదీరా ఏడ్చేశాను!

తర్వాత తరచుగా నాకో కల వచ్చేది. అందులో ట్రయిన్ వెళ్ళిపోతూ వుంటుంది. అందులోనుంచి వుంగరం మెరుస్తున్న చెయ్యి, నాకు వీడ్కోలు చెబుతూ వుంటుంది. అక్కడ జనం ఎవరూ వుండరు. ట్రయిన్ వెళ్ళిపోగానే, నాకు భరించలేనంత ఒంటరితనంగా అన్పిస్తుంది.

ఆ ఒంటరితనంలోనే, అంతులేని నిరీక్షణంలో, కాలం నత్తనడకలా నడుస్తుంటే మూడున్నర సంవత్సరాలు గడిచినాయి.

విజయ్ వెళ్ళిన తర్వాత బేలతనానికి లొంగిపోకూడదని, ధైర్యంగా వుండాలని నాలో నేను శపథంచేసుకున్నాను. బాబుకి నాలుగైదు నెలలు వచ్చిన తర్వాత మామయ్య ప్రోద్బలంమీద నేను ఆడపిల్లలల కాలేజీలో జూనియర్ లెక్చరర్‌గా జాయినయాను! పగలంతా, కాలేజీలో పాఠాలకి సంబంధించినపని, యింటికిరాగానే, సంజయ్‌తో కాలక్షేపం! ఇలా ఒంటరితనానికి ఉచ్చు బిగించాలని నేను చేసే ప్రయత్నం రాత్రివేళల పూర్తిగా విఫలమయేది! నాకు నిద్రపట్టేదికాదు! దిగులుగా అనిపించేది. విజయ్ ఎక్కడున్నాడో, ఎంత కష్టపడుతున్నాడో అనిపించేది.

మన దేశానికి పాకిస్తాన్‌తో యుద్ధం ప్రారంభమైంది. తర్వాత బంగ్లాదేశ్ సమస్య! విజయ్ కోలీగ్ సుందరం యుద్ధంలో పోయాడు. అతని తల్లి దుఃఖం చెప్పనలవి కానిది.

ఆరోజు కాలేజినుంచి రాగానే, అమ్మ యీవార్త చెప్పగానే బట్టలైనా మార్చుకోకుండా, వాళ్ళ యింటికి పరుగెత్తాను. ఆ యిల్లు శోకసముద్రంలో వుంది. తండ్రి పడక్కుర్చీలో, ముఖంమీద తువాలేసుకుని దుఃఖం ఎవరికీ పంచటం యిష్టంలేనట్టుగా కూర్చుని వున్నాడు. తల్లి సుందరం పిల్లల్ని దగ్గరకి తీసుకుని ఏడుస్తోంది. సుందరం భార్య అమృత అయితే మరీను, తల గోడకేసి బాదుకుంటుంటే తల్లీవాళ్ళు బలవంతంగా పట్టుకుని

ఆపేస్తున్నారు. అమృత నన్ను చూడగానే చేతులు చాస్తూ వచ్చేసింది, 'రాధా! అయిపోయింది. నా జీవితం బుగ్గి అయిపోయింది. నే నెలా బ్రతకాలి. ఈ పిల్లల్ని ఏం చెయ్యాలి!' అమృతని గుండెలకి అదుము కున్నాను. నాకు ఏడుపు వచ్చేసింది. అమృతకి నే నేమని ధైర్యం చెప్పను ? రేపు నాకూ యిదే స్థితి వస్తుందేమో! నా శరీరం జలదరించింది.

ఆరోజు రాత్రి పొద్దుపోయిన తర్వాత నీరసంగా యింటికి తిరిగి వచ్చాను! నాకడుపులో అర్థంగాని మంట, గుండెల్లో చెప్పనలవిగాని వేదన! అతని క్షేమం తెలియచేసే కబురుకోసం ఎదురుచూసే ఆరాటం! ఏ రెండు నెలలకో, ఎక్కడినుంచో, నేను 'క్షేమంగా వున్నాను. నువ్వు ధైర్యంగా వుండు. బాబు ఎలా వున్నాడు!' అని అతికష్టంగావున్న వుత్తరం వచ్చేది. ఆరోజు ఎంత సంతోషపడిపోయేదాన్నో! పండగలా వుండేది! చెప్పలేని బలంవచ్చేది! జవాబు వ్రాయడానికి అడ్రస్ వుండేదికాదు. మళ్ళీ వుత్తరం వచ్చేదికాదు! అదొక భయంకరమైన నిశ్శబ్దం! ఆ నిశ్శబ్దంలో, నా మనసు గమ్యం తెలియని వ్యక్తిలా, ప్రయాణం చేస్తున్నట్టుగా వుండేది. రోజులు వారాలుగా, వారాలు నెలలుగా, కాలచక్రం వేగంగా తిరిగిపోతూనే వుంది! 3 సంవత్సరాలు యిట్టే గడిచిపోయినాయి. ఈ మూడు సంవత్సరాలలో నేను ఎన్నో పరీక్షలకి తట్టుకోవాల్సివచ్చింది! హార్ట్ఎటాక్ వచ్చి అమ్మ పోయింది! మామయ్య మరీ సుస్తీమనిషి అయిపోయాడు. ఆయనకు డాక్టరు ఏదయినా పల్లెటూరు వెళ్ళి వుండమని సలహా యిచ్చాడు. సిటీలో ఒంటరిగావున్న నన్ను ఆయన వదిలివెళ్ళలేడు. నేను మాత్రం వుద్యోగం వదిలి ఎలా వెళ్ళను.

ఈ గడ్డురోజుల్లో ఉద్యోగమే నాకు శ్రీరామరక్ష అయింది. నా కోలెక్చరర్స్ ఎంతో మంచివాళ్ళు! నేనంటే ఎంతో అభిమానం, సానుభూతి చూపించేవాళు! తరచుగా నేను వాళ్ళలో ఎవరినో ఒకరిని, నా యింటికి భోజనానికి, టీకి రమ్మనమని పిలుస్తూ వుండేదాన్ని! ఈ ఒంటరి సమయంలో విజయ్ తమ్ముడు రమణ నాకు చాలా అండగా నిల్చాడు! అతని భార్య దుర్గ

గడుసరి, నోటితొందరగల మనిషి అయినా, నన్ను మాత్రం గౌరవంగానే చూసేది! సంజయ్ రమణదగ్గర బాగా అలవాటు అయాడు. రమణ కంపెనీలో వుద్యోగం చేస్తున్నాడు. ఇద్దరుపిల్లలు. చాలీచాలని జీతం! దుర్గ నాదగ్గర చీటికి, మాటికి డబ్బు అప్పు అడిగి తీసుకువెళ్ళేది! నాకు అది బాధగా కాస్తకూడా అనిపించేదికాదు. వాళ్ళు నాకు ఒంటరితనం పోగొడుతూ, ఒకరకంగా సాయపడితే, నేను మరోరకంగా వాళ్ళకి సాయపడ గలుగుతున్నందుకు నాకు చాలా ఆనందంగా వుండేది.

ఈ మూడున్నర సంవత్సరాలలో సంజయ్ పెరిగాడు. బాగా నడక, మాటలు వచ్చేసినాయి. అందులో నేను కాలేజీకి వెళ్ళేటప్పుడు దుర్గదగ్గర వదిలి, సాయంత్రం వచ్చేటప్పుడు తిరిగి తీసుకువచ్చేదాన్నేమో - దుర్గ వాగుడుతనం అంతా వాడికి వచ్చేసింది.

ఫ్రెండ్స్ అందరినీ నాకుదగ్గరగా తెచ్చే ఫోన్ నాకు ఆప్తమిత్రురాలు అయింది. నా కొలీగ్స్‌కి కొంతమందికి ఫోన్స్ వున్నాయి. ఆదివారంవస్తే ఫోన్‌దగ్గర కూర్చుంటే టైమ్ యింతయిందా అనే ధ్యాసే వుండేదికాదు. విజయ్ లేని ఒంటరితనాన్ని యిలా పదిమందితో కలిసి మెలిసి వుండి, వాళ్ళని నాలో కలుపుకుని, జీవితంలో శూన్యంచోటు చేసుకోకుండా జాగ్రత్త పడ్డాను నేను.

ఒకరోజు ఆదివారం —

మధ్యాహ్నంవేళ ఫోన్ మోగింది. పుస్తకం చదువుకుంటున్న నేను లేచివెళ్ళి తీశాను. ఢిల్లీనుంచి ట్రంక్‌కాల్! ఆపరేటర్ నంబరు కలుపుతోంది. ఢిల్లీనుంచి ట్రంక్‌కాలా? ఎవరై వుంటారబ్బా! అనుకుంటూ నిలబడ్డాను.

ఇంతలో ఆపరేటర్ స్వరం 'స్పీకాన్ ప్లీజ్' అని వినిపించింది.

'హలో' అన్నాను.

'హలో, రాధా!'

ఆ పేరు వినగానే పులిక్కిపడ్డాను. నిటారుగా అయాను.

'రాధా! నువ్వేనా' అవతలనుంచి విన్పిస్తోంది.

'ఎవరు? ఎవరు? ఎవరు మాట్లాడేది?' నా చెవుల్ని నమ్మలేనట్టుగా బిగ్గరగా అరిచేశాను.'

'నేను! విజయ్‌ని!'

'విజయ్!' అరిచేశాను.

'రాధా!'

ఆ పేరు వినగానే అంతులేని సంతోషం, చెప్పలేనంత దుఃఖం కెరటాల్లా వుప్పెత్తున లేచాయి.

'ఎక్కడనుంచి మాట్లాడుతున్నావు?'

'ఢిల్లీలో ఒక ఫ్రెండ్ యింటినుంచి.'

'అడ్రస్ చెప్పు నేను వచ్చేస్తాను.'

'నో! నేనే వచ్చేస్తున్నాను.'

'ఎప్పుడు?'

'నాలుగైదురోజుల్లో!'

'నాలుగైదురోజులు! నావల్లకాదు. ప్లేన్‌లో రెండుగంటలుకూడా పట్టదు. నే నిప్పుడే ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళిపోతాను.'

అతను నవ్విన శబ్దం అయింది.

'ఎక్సయిట్ కావద్దు! నేను వచ్చేస్తున్నాను. గురువారం అక్కడ వుంటాను. చూడు ఎవరికీ చెప్పవద్దు, నేను వచ్చేస్తున్నాను. శాశ్వతంగా!'

'నిజంగా?'

'నిజంగా! మళ్ళీ వెళ్ళనే వెళ్ళను.'

'ఎందుకని! ఉద్యోగం వదిలేశావా?'

'ఉహూఁ!'

'మరి?' రెట్టించాను.

అతను క్షణం ఆగాడు.

'చెప్పు' తొందరచేశాను.

'ఉద్యోగమే నన్ను వదిలేసింది.'

'నిజంగా! ఎంతశుభవార్త. ఐయామ్ వెరీ వెరీ హేపీయస్ట్ వుమెన్ యిన్ ది వరల్డ్! విన్నావా! ' డోంట్ వర్రీ, నీకు ఉద్యోగం లేకపోయినా ఫర్వాలేదు, మనకేం లోటులేదు. నాకు ఉద్యోగం వుందిగా!'

'థాంక్ యూ! రాధా! బాగున్నావా?'

'బాగా!' నేను ఏడవసాగాను.

'ప్లీజ్! మన కష్టాలు తీరిపోయినాయిగా! నేను వచ్చేస్తున్నాను.'

'థాంక్ గాడ్' అస్పష్టంగా అన్నాను.

'రేపో ఎల్లుండో నీకు ఒక ఉత్తరం అందుతుంది.'

'ఏముంది అందులో?'

'చదువు, నీకే తెలుస్తుందిగా!'

'విజయ్! ఎన్నిరోజులు అయింది నిన్ను చూచి' నాకు మళ్ళీ ఏడుపు వచ్చేసింది.

అతను డగ్గుత్తికతో అన్నాడు, 'రాధా! నాకు అలా అనిపించటం లేదు. నిన్ననే నిన్ను వదిలి వెళ్ళాను, నువ్వు ట్రయిన్‌దగ్గరికి వచ్చి వీడ్కోలు యిచ్చావు, ఈరోజు తెల్లవారింది. నీకు ఫోన్ చేశాను. ఈమధ్య కాలం గడిచిందే — అది రోజులో, వారాలో, నెలలో, సంవత్సరాలో నాకు తెలియదు. ఎందుకంటే ఆ టైములో నేను మనిషిగా బ్రతకలేదు. మరగా జీవించాను. తెలిసిందా?'

నాకు అర్థమైంది.

'బహుశా నీకు ఫోన్ చేయటానికి మళ్ళీ వీలుకాదు. నేను గురువారం వచ్చేస్తున్నాను. ప్లేన్ టికెట్ వెయిటింగ్ లిస్టులో వుంది. టికెట్ దొరకగానే టెలిగ్రాం యిస్తాను. ఓ.కే.'

'సరే!'

'ఇక వుండనా?'

'గురువారంకోసం వెయిట్ చేస్తాను.'

'నేనుకూడా.'

'రాధా! సంజూ ఎలా వున్నాడు?'

నాకు హఠాత్తుగా వాడి సంగతి గుర్తుకువచ్చింది.

'దివ్యంగా వున్నాడు. వాడితో మాట్లాడించనా?'

'ఊఁ!'

'నేను రిసీవర్ పక్కకుపెట్టి వాకిట్లోకి పరుగెత్తి ఆడుకుంటున్న వాడిని ఎత్తుకువచ్చాను. ఫోన్ చేతికి యిచ్చి 'హలో డాడీ!' అనమన్నాను. వాడికి ఆటమధ్యలో హఠాత్తుగా లాక్కువచ్చినందుకు కోపం వచ్చినట్టుంది. మూతి బిగించాడు. 'అను మా తండ్రివికదూ!' బ్రతిమిలాడాను. వినలేదు. 'అను' కసిరాను. వాడు వెంటనే ఫోన్‌లోకి 'హలో!' అని అరిచాడు.

'హలో! సంజూ —'

'నాపేరు సంజయ్.'

'హలో సంజయ్! నేను ఢిల్లీనుంచి వస్తున్నాను. నీకేం కావాలి?'

'నాకా! మా డాడీని తెచ్చిపెట్టండి.'

ఎవరు ఎప్పుడు అడిగినా, వాడు అలాగే సమాధానం చెబుతాడు.

'మై గాడ్!' విజయ్ ఫోన్లో నవ్వటం నాకు విన్పిస్తూనే వుంది.

అప్పటికే చాలా టైమ్ అయిందని, ఆపరేటర్ హెచ్చరించటంతో విజయ్ ఫోన్ పెట్టేశాడు.

సంజయ్ ఆటకి పరుగెత్తాడు. నాకాళ్ళు ఒణుకుతున్నాయి. గుండె ఆనందోత్సాహాలని తట్టుకోలేనట్టుగా, వేగంగా కొట్టుకుంటోంది! నేను అక్కడేవున్న కుర్చీలో కూలబడ్డాను. ఆ రాత్రి ఎలా గడిచిందో నాకు తెలియదు. కాలేజీకి ఒక రెండువారాలు శలవు వ్రాసి పంపేశాను. మర్నాడు నా కొలీగ్స్ సుభద్ర, జానకి, సరస్వతి వచ్చారు. కొంతమంది ఫోన్ చేశారు. నా ఆరోగ్యం బాగానే వుందనీ వూరికే శలవు పెట్టానని వాళ్ళని నమ్మించే సరికి నా తాతలు దిగివచ్చారు. నాకు ఏంతోచలేదు! ఇల్లంతా సర్దాను. విజయ్ వెళ్ళేసరికి మేం అద్దెయింట్లో వున్నాం. అమ్మ పోయినతర్వాత, బ్యాంకులో ఆమె నాకు వుంచిన డబ్బు కట్టి నేను హవుసింగ్‌బోర్డు ఇల్లు

ఒకటి తీసుకున్నాను. విజయ్ పుస్తకాలు, బట్టలు అన్నీ మళ్ళీ సర్దాను ! వాటికి మీ యజమాని వస్తున్నాడు సుమా అని మనసులోనే హెచ్చరికలు చేశాను.

ఆ మధ్యాహ్నం, పోస్టులో వుత్తరం వచ్చింది ! నేను ఎంతో సంతోషంతో దాన్ని, తీసుకువచ్చి మంచంమీద కూర్చుని చదువుకోసాగాను. అందులో యిలా వుంది :

'రాధా డియర్ !

ఎన్నివారాలనుంచో నీకు యీ వుత్తరం వ్రాయాలని ! నాకు శక్తి చాలలేదు. నేను దాదాపు 3 నెలలుగా హాస్పిటల్లో వున్నాను. రాధా ! నువ్వు కనిపించగానే, రెండుచేతులూ చాచి, నిన్ను దగ్గరకు లాక్కునే అదృష్టం నాకు పోయింది. నా కుడిచేతిని యుద్ధరంగానికి అప్పచెప్పేశాను. ఒంటిచేత్తో అవిటివాడిగా నీదగ్గరకు వస్తున్నాను. నిన్ను యిన్నాళ్ళూ నేను దగ్గరకు లాక్కునేవాడిని ! ఇప్పుడు నువ్వే నన్ను దగ్గరకి తీసుకోవాలి. ఏయ్ ! రాధా! ఏడుస్తున్నావా? చాలామందికంటే మనం నయంకదా ! నాతోపాటు పనిచేసే ముగ్గురు చనిపోయారు. వాళ్ళకంటే మనం నయంకదా ! నాకు ఒక చెయ్యి పోతే ఏమౌతుందిట ! ఇంటిదగ్గర నాకోసం యింకో నాలుగుచేతులు భగవంతుడు వుంచాడు, 'నీవి, సంజయ్ !' సంజయ్ పెద్దవాడయినాడేమో కదూ? ఏడవకు. ధైర్యం తెచ్చుకో ! ఎయిర్‌పోర్ట్‌కి నువ్వు ఒక్కదానివే రా ! యింకెవరూ వద్దు ! నేను వస్తున్నట్టు ఎవరికీ తెలియచేయకు. కొద్ది రోజులు నేను నీతో, సంజయితో ఒంటరిగా గడపాలి. చుట్టాలని చూడాలని వుంటే తర్వాత మనిద్దరం వెళదాం ! ఏమంటావు రాధా ! ఏడవకు. 3½ సంవత్సరాలు తర్వాత వస్తున్న భర్తకి ఎలాటి వెల్‌కమ్ యిస్తావో చూస్తాను. వుంటాను. ఈ వుత్తరం నా ఎడమచేతివ్రాత ! దాదాపు రెండునెలలనుంచి ప్రాక్టీసు చేయగలిగితే యీ మాత్రం వ్రాయగలుగుతున్నాను, వుంటాను. ఈలోపల వీలయితే ఫోన్ చేస్తాను. లేకపోతే గురువారం వచ్చేస్తాను. ప్లేన్

టికెట్ దొరకగానె టెలిగ్రాం యిస్తాను. విశేషాలు కలుసుకున్నప్పుడు! ఎన్నో కబుర్లున్నాయి. నువ్వు వినలేక విసుగు పడతావేమోనని భయంగా వుంది. ఇక ముగించనా! ప్రేమతో,

విజయ్.'

ఆ పుత్తరం నాలోని వుత్సాహపు పొంగుమీద నీళ్ళు చల్లేసింది! ఒకసారికాదు, వందసార్లు, వేయిసార్లు చదువుకున్నాను. విజయ్ వుద్యోగం ఎందుకు పోయిందో నాకు అర్థమైంది. యుద్ధంలో చెయ్యిపోగొట్టుకున్న అతను యిక ఆ వుద్యోగానికి అనర్హుడు. విజయ్ వచ్చేస్తున్నాడు. శాశ్వతంగా వచ్చేస్తున్నాడు. ఇక మా యిద్దరిమధ్యా ఎడబాటు అనేదిలేదు. విజయ్‌కి చెయ్యి లేకపోతేనేం! నా చేతులు అతనివికావా? నా రెండు చేతులూ చూసుకున్నాను. వాటిల్లో ఇకనుంచి ఒక చెయ్యి నాదికాదు, విజయ్‌ది! అనుకున్నాను. అతను కోరినట్టే నేను విజయ్ రాకగురించి, ఎవరికీ చెప్పలేదు.

ఇంతలో హఠాత్తుగా మైక్‌లో ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

'ఢిల్లీనుంచి ప్లేన్ 5 నిముషాల్లో లాండ్ అవబోతోంది' నేను వులిక్కిపడినట్లుగా యీ లోకంలోకి వచ్చాను.

ఎనౌన్స్‌మెంట్ హిందీలో, యింగ్లీషులో విన్పిస్తోంది.

విజయ్ వస్తున్నాడు! వచ్చేస్తున్నాడు.

విజయ్‌ని అవిటివాడిగా చూడబోతున్న క్షణాలు దగ్గరపడుతున్నాయి. కళ్ళముందు, ఆరోజు రైలులో క్రమంగా దూరమౌతూ ఉంగరం మెరుస్తున్న చెయ్యి నాకళ్ళముందు కదులుతోంది.

ఒక అరక్షణం కళ్ళుమూసుకుని మనసు చిక్కబట్టుకున్నాను. ధైర్యం, వ్యక్తిత్వంలాటివి కూడదీసుకున్నాను. నా ముఖంలో బాధ రవంత కూడ అతనికి తెలియకూడదు. భగవంతుడా ఆ శక్తిని ప్రసాదించు.

'మమ్మీ! నాచెయ్యి నొప్పిపుడుతోంది' అన్నాడు సంజయ్. నేను ఆలోచనలోపడి వాడి భుజం గట్టిగా పట్టుకున్న సంగతి గుర్తించలేదు. ఉలిక్కిపడినదానిలా చెయ్యి వదిలేశాను.

దూరంగా విమానం, రెక్కలుచాచిన పక్షిలా ఎగురుతూ వచ్చి, ఒంపు దిరిగి, భూమిమీద వాలింది. ఆ క్షణంలో నాకది, నా విజయ్‌ని పదిలంగా తెచ్చి, నాకు అప్పగిస్తున్న దేవదూతలా కనిపించింది. నేను చూస్తుండగానే దాని చక్రాలు, రన్‌వేమీద నామనసులాగానే వేగంగా, పరుగెత్తసాగినాయి.

దాని మోత నా మనసులో హోరులా వుంది.

ప్లేన్ ఆగింది.

హఠాత్తుగా, నేను తీసుకున్న జాగ్రత్త, నాకు నేను యిచ్చుకున్న శిక్షణ, పడిన శ్రమ గాలిలో కలిసిపోయినాయి.

నా గుండెలు రెప రెపలాడుతున్నాయి.

ప్లేన్ దగ్గరకి మెట్లు తోసుకుని వెళ్ళారు.

ప్లేన్ తలుపులు తెరుచుకున్నాయి.

అందులోనుంచి ఎవరెవరో దిగుతున్నారు. నాకళ్ళు రెప్పవేయటం మర్చిపోయినట్టుగా, ప్లేన్‌లోనుంచి దిగుతున్న వాళ్ళని పరిశీలిస్తున్నాయి!

ఆ నాలుగునిముషాలూ, నాలుగుయుగాలు ఎదురుచూసినంత భారంగా అనిపించినాయి.

హఠాత్తుగా నాగుండెలు ఆగినట్టయింది.

అందరితర్వాత, ఆఖరున, చిట్టచివరి ప్రయాణీకుడిగా విజయ్ దిగి వస్తున్నాడు. అతన్ని చూడగానే, ఆనందం, చెప్పలేని నిశ్చింత, దుఃఖం నన్ను సుడిగాలిలా చుట్టేసినాయి. రెండుచేతులూ చాచి, పరుగెత్తుతూ అతనికి యెదురు వెళ్ళాలని అనిపించింది.

అతని కుడిచెయ్యి షర్ట్ దిగువునుంచి మొండిగా కన్పిస్తోంది. దాన్ని చూడగానే నా గుండెలు చెరువైనాయి. నొప్పి, భరించలేని నొప్పి! ఆ క్షణంలో రెక్కలు తెగిన పక్షిలా నా మనసు గిలగిలలాడసాగింది.

నా కుడిచెయ్యి తెగి క్రిందపడినటువంటి భయంకరమైన బాధ. భగవాన్! అందులోనూ కుడిచెయ్యి! నా కళ్ళముందు టెన్నిస్ ఛాంపియన్‌గా ఆడే విజయ్, రాకెట్ కుడిచేత్తో తిప్పుతూ కనిపించాడు.

అతని అందమైన దస్తూరి గుర్తుకువచ్చింది. ఒకసారి నడుస్తూ తూలి పడబోతుంటే అతని చెయ్యివచ్చి నన్ను నడుంచుట్టూ పట్టుకుని ఆపిన సంఘటన మెరపులా కళ్ళముందు మెదిలింది.

ముందుకు నడుస్తున్న ప్రయాణీకులు, ఒకరిద్దరు వెనక్కి తిరిగి, అతన్ని చూస్తున్నారు. అతను మాత్రం ఎటూ చూడకుండా, చకచకా నడిచి వచ్చేస్తున్నాడు. ఎంత చక్కటి విగ్రహం! ఎంత హుందాఅయిన నడక! భగవంతుడే చూడలేకపోయాడా అన్పిస్తోంది. దేవాలయంలో చెయ్యి తెగిన అందమైన శిల్పం గుర్తుకు వస్తోంది.

'సంజూ! నేను చెప్పింది గుర్తుందా? డాడీ కనిపించగానే ఏమంటావ్ చెప్పు!' ఆతురతగా అడిగాను.

'హలో డాడీ అంటాను. వెల్‌కమ్ హోమ్. అని బుగ్గమీద ముద్దు పెట్టుకుంటాను' ముద్దు ముద్దు మాటలతో, నేను మూడురోజులుగా నేర్పుతున్న పాఠం, నాకు అప్పచెపుతున్నట్టుగా అన్నాడు.

డాడీని వాడు యింతవరకూ యెరగడు! నిత్యం నేను డాడీ అనే వ్యక్తిని గురించి చెప్పేమాటలు వాడిలో ఒక వుత్సాహాన్ని, ఆసక్తిని రెచ్చగొట్టినట్టు నేను గమనించాను.

విజయ్ దూరంనుంచి నన్ను చూసి గుర్తుపట్టగానే వెంటనే చేతిలో ఎయిర్ బాగ్ క్రిందపెట్టి అదే చెయ్యియెత్తి వూపాడు.

నేను సంజయ్ చేయి యెత్తిపట్టుకుని వూపాను. నన్ను చూడగానే అతని అడుగులవేగం రెట్టింపు అయింది.

ఇక కదలకుండా నిలబడటం నావశం కాలేదు.

మూడు సంవత్సరాలుగా ఒకరికి ఒకరు, కొన్నివేలమైళ్ళ దూరమై, వుత్తరాలద్వారా మాత్రమే సన్నిహితంగా వుంటూ, శారీరకంగాకాక, మానసికంగా ఒకరి వూహల్లో మరొకరు బ్రతుకుతూ, గడిపిన సుదీర్ఘమైన 'యెడబాటు' అనే అఘాతపు అంచులు కలుసుకుంటున్నాయి! ఇద్దరం చేరువ అవుతున్నాం.

అతను దగ్గరగా వచ్చాడు. అప్పటికే నేను చేరువ అయాను. అతను చేతిలో ఎయిర్‌బాగ్ క్రిందపడేసినట్టుగా వదిలేసి చప్పున నా భుజం చుట్టూ చేయివేశాడు. నాతల అతని గుండెలకి ఆనింది.

ఆ క్షణంలో, ఆ చుట్టుపక్కల యెందరున్నారో, యేం చేస్తున్నారో నేను సర్వం మర్చిపోయాను.

'రాధా !' అస్పష్టంగా అంటున్న అతని కంఠం !

నా గొంతు అయితే మూసుకుపోయినట్టుగా మాటే పెగలటంలేదు. ఆనందపు సుడిగాలిలో చిక్కుకున్నంతలా కంపిస్తూ నేను అతన్ని పట్టుకున్నాను.

నా కిప్పుడు అర్థమైంది - అతను యెవ్వరినీ యెందుకు రావద్దన్నాడో! ఒకరిని ఒకరు చూసుకునే యీ ఆనందం యెంతో అపురూపంగా వుంది.

ఇది ఇంకోరికి పంచటం ఏమాత్రం యిష్టం లేనట్టుగా వుంది. నేను యేడవకూడదనే అనుకుంటున్నాను. నన్ను నేను శాసించుకోబోయాను. కానీ నావశం కావటంలేదు. కళ్ళలోనుంచి నీళ్ళు జలజలలాడుతూ, ప్రవాహంలా బైటకి వురకసాగినాయి.

అతని చేయి నాజుట్టుని నలిపేస్తోంది.

'అమ్మా ! యెవరే యీాయన ?' సంజయ్ నన్ను లాగుతూ అన్నాడు. నేను వాడి సంగతి మర్చిపోయాను. 'డాడీ అని చెప్పానే-' అన్నాను. వాడి కళ్ళు ఆశ్చర్యంగా పెద్దవైనాయి.

'ఎవరూ !' విజయ్ అప్పుడే సంజయ్‌ని చూస్తున్నట్టుగా అన్నాడు.

'సంజూ!'

'ఎవరూ ! సంజూనా ! మై గాడ్ !' విజయ్ హఠాత్తుగా నన్ను వదిలి, ఆ ఒక్కచేత్తోనే వాడిని లాక్కుని యెత్తుకున్నాడు.

అతని కళ్ళు సంభ్రమంగా, ఆశ్చర్యంగా, నమ్మశక్యంగానట్టుగా వాడి ముఖంలో అణువణువునీ పరిశీలిస్తున్నాయి.

'బాప్‌రే ! యెంత పెద్దగా అయాడు. నాకు యింకా ఆ వుయ్యాలలో ఆ పసికందుగానే గుర్తుకువస్తున్నాడు.'

'వెల్‌కమ్ హోమ్ డాడీ !' సంజయ్ అప్పచెప్పినట్టుగా అని విజయ్ బుగ్గమీద గట్టిగా ముద్దుపెట్టుకుని, వెంటనే సరిగ్గా చెప్పానా లేదా అన్నట్టు నావైపు చూశాడు.

'ఓహ్ ! రాధా ! వాట్ ఎ వండర్‌ఫుల్ యెక్స్‌పిరియన్స్ !'

అతని రెండోచెయ్యి వుంటే బహుశా నా నడుంచుట్టూ పడేదేమో ! అది గమనించిన నేను అతని నడుంచుట్టూ చేయివేసి పసిపిల్లలా సంబరంగా హత్తుకున్నాను.

ముగ్గురం బైటకి వచ్చాం.

లగేజ్ త్వరగానే వచ్చింది.

నేను వెళ్ళి దూరంగా పార్కుచేసిన కారు తీసుకుని వచ్చాను.

పోర్టర్ డిక్కీలో సామాను తెచ్చిపెట్టాడు.

విజయ్ అతనికి డబ్బులు యిచ్చాడు.

నేను స్టీరింగుమీద చేతులువేసి కూర్చున్నాను. విజయ్ సంజయ్‌ని ఒడిలో పట్టుకుని కూర్చున్నాడు.

కారు స్టార్ట్ చేశాను. అతని చూపులు స్టీరింగ్‌మీద నిల్చినాయి. ఆతని దవడఎముక కదలటం చూస్తూనే వున్నాను.

'విజయ్ ! భయంవేస్తోంది. దేనికయినా గుద్దేస్తానేమో !' కంపిత స్వరంతో అన్నాను.

'ఫర్వాలేదులే, ముగ్గురం ఒకేచోట వున్నాంగా !'

నేను నిదానంగా డ్రైవ్ చేస్తున్నాను. విజయ్ లేనప్పుడు నేను కారు నడుపుతాను. కానీ విజయ్ వుంటే యెప్పుడూ స్టీరింగ్ అతనికే ఇస్తాను.

మా పెళ్ళి అయిన కొత్తలో, అతను నాకు డ్రైవింగ్ నేర్పటానికి పడిన అవస్థ గుర్తురాసాగింది. పల్లెటూరునుంచి వచ్చానేమో – నా కసలే, యీ సిటీరోడ్లు, వాటిమీద గడబిడగా రిక్షాలు, కార్లు, ఆటోలు భయంగా అనిపించేవి ! ఒకదానికి యింకోటి యెక్కడ ఢీ కొట్టుకుంటుందోనని హడలుగా వుండేది.

కారులో విజయ్ పక్కన కూర్చుని వెళుతుంటే, నాకు వూపిరి బిగబట్టినట్టుగా వుండేది! అలాటిది, కారు డ్రైవింగ్ నేర్చుకోవటమా! కానీ నామాట విజయ్ వినలేదు. బలవంతంగా నేర్పటం ప్రారంభించాడు. స్టీరింగ్ ముందు నన్ను కూర్చోబెట్టి, దాన్ని పట్టుకోమని, అతని రెండుచేతులతో, నా చేతులు కలిపేవాడు. పెళ్ళి అయిన కొత్తరోజులు! అతని స్పర్శకు నాకు గిలిగింతలు పెట్టినట్టుగా వుండేది! అతను డ్రైవింగ్ గురించి జాగ్రత్తలు చెబుతుంటే, నేను అతని చేతులు చూస్తూ కూర్చునేదాన్ని. సడన్‌బ్రేక్ వేసినప్పుడు, ఇద్దరం తూలేవాళ్ళం. నేను అతనిభుజం పట్టుకునేదాన్ని! నాతల అతని భుజానికి ఆనితే వెంటనే తీయబుద్ధి అయేదికాదు.

'నువ్వింత మొద్దువి అనుకోలేదు. త్వరగా నేర్చుకుంటావనుకున్నాను' అని కసిరాడు ఒకసారి. నాకు రోషం వచ్చేసింది. ఒక వారంరోజుల్లో డ్రైవింగ్ నేర్చేసుకున్నాను.

నేను నిట్టూర్చాను!

విజయ్‌కూడా అన్నాడు, 'రాధా! ఆరోజులలో ఎంత బలవంతంగా నీకు డ్రైవింగ్ నేర్పించానో గుర్తుందా?'

'గుర్తుంది' అన్నట్టు తలవూపాను.

'భగవంతుడు ముందు, ముందు నాకు ఇబ్బంది కలుగుతుందని కాబోలు, అప్పుడాపని చేసేలా పురిగొలిపాడు.'

నేను మాట్లాడలేదు.

నాకు మళ్ళీ అదే గుర్తుకు వస్తుంది. డ్రైవింగ్ చేస్తుంటే అతని చేతు లెంత బాగుండేవి! కుడిచేయికివున్న వుంగరం ఎలా మెరిసేది. కారు యింటిముందుకు వచ్చి ఆగింది. కారు హారన్ వినగానే జానీ వరండాలోనుంచి భౌ భౌ మని అరవటం ప్రారంభించింది.

'జానీ!' విజయ్ ఈలవేసి పిలిచాడు.

దాని చెవులు నిక్కబొడుచుకున్నాయి.

'జానీ!' విజయ్ మళ్ళీ ఈల వేశాడు.

నేను తాళం తీశాను. జానీ విజయ్‌దగ్గరకు వచ్చి వాసన చూసింది.

ఆ వెంటనే అతనిమీదికి ముందుకాళ్ళు యెత్తి ఆన్చి కుయ్ కుయ్ మంటూ గొడవ చేయసాగింది.

'వాట్ మాన్ ! ఆర్ యూ ఆల్‌రైట్ !' విజయ్ దానితలమీద చేయి వేసి నిమరసాగాడు.

నేను గబ గబా వెళ్ళి అన్ని గదుల తలుపులూ తెరిచి లైట్లు వేశాను. వంటయింట్లోకి వెళ్ళి చకచకా కాఫీ కలిపి తెచ్చేసరికి విజయ్ సోఫాలో కూర్చుని వున్నాడు. అతని ఒళ్ళో ఎడంపక్కచేయి ఒంపులో ఒదిగి సంజయ్ కూర్చునివుంటే, యెడమపక్క జానీ తల ఆని వుంది.

'ఒక కప్పు పాలు జానీకికూడా తీసుకురా !' అన్నాడు.

నేను లోపలికివెళ్ళి పాలు దాని పళ్ళెంలో పోసి తెచ్చాను. విజయ్ దానిముందు పెట్టాడు. అది ఆబగా తాగింది.

నేను త్వరగా వంట చేశాను.

'నువ్వు స్నానం చేయి, భోజనం చేద్దువుగాని' అన్నాను.

అతను తలవూపాడు.

కొద్దిసేపయిం తర్వాత — డైనింగ్‌టేబిల్‌దగ్గర నేను అన్నీ సర్దుతున్నాను. ఇంతలో బాత్‌రూమ్‌లోనుంచి 'రాధా' అని పిలుపు వినిపించింది. స్నానం చేసిన అతను బట్టలకోసం పిలుస్తున్నాడు. ఆ పిలుపుకి నాలో ప్రాణంలాటిది రాసాగింది. సంవత్సరాల తరబడి వంటరితనంతో బెంబేలు పడుతున్న నా మనసుకి ఆలంబన దొరికినట్టుగా, చేతులు చాచి ఆ శబ్దాన్ని కౌగలించుకున్నట్టుగా వుంది.

'బట్టలు బెడ్‌రూమ్‌లో మంచంమీద పెట్టాను' అని చెప్పాను.

డైనింగ్‌టేబుల్‌మీద అన్నీ సర్ది, భోజనానికి రమ్మనమని పిలవటానికి వచ్చేసరికి, అతను అద్దంముందు నిలబడి యెడంచేత్తో తల దువ్వుకుంటున్నాడు. అతనికి ఎడంచేత్తో అన్నిపనులూ చేయడం అప్పుడే బాగా అలవాటు అయిపోయినట్టు వుంది.

వచ్చి భోజనానికి కూర్చున్నాడు.

నేను ప్లేటులో అన్నం కలిపి అతనికి తినిపించాను. మొదటి ముద్ద పెడుతుంటే, క్షణంసేపు నావైపు చూసిన అతను, వెంటనే ఎడంచెయ్యి నా నడుంచుట్టూ పెనవేసి నా పొట్టలో తలదాచుకున్నాడు.

'రాధా —'

నా గొంతులోకూడా ఏదో అడ్డుపడ్డట్టే అయింది. అతని తలమీద చేయివేసి నిమురుతూ వుండిపోయాను.

అతని గడ్డంపట్టి ఎత్తి నోట్లో అన్నంపెట్టాను. అతని కళ్ళు చెమ్మగిలి వుండటం స్పష్టంగా కన్పిస్తోంది.

విజయ్ పక్కనే కూర్చునివున్న సంజయ్ విప్పారిన నేత్రాలతో మా యిద్దరినీ చూస్తుండటం గమనించగానే నేను మెల్లగా అతని తల వదలేశాను.

విజయ్ 'స్పూన్ యివ్వు' అన్నాడు. నేను చెంచా తెచ్చి యిచ్చాను. అతను దానితో అన్నం ఎడంచేత్తో తీసుకుని చకచకా తినసాగాడు.

అతని బలవంతంమీద నేనుకూడా కూర్చుని అన్నం తిన్నాను. సంజయ్ పడుకోబోతుండగా, రగ్గు కప్పుతున్న నా చెయ్యి పట్టుకుంటూ అడిగాడు 'మమ్మీ! ఈ డాడీ యెప్పుడు వూరు వెళ్ళిపోతాడు!'

నేను ఆశ్చర్యంగా చూశాను. 'యెందుకనిరా?' అన్నాను.

'ఆ డాడీ అంటే నా కిష్టంలేదు. అన్నం నాకు తినిపించకుండా ఆ డాడీకి తినిపించావుగా!'

నేను వాడిబుగ్గ గిల్లాను. 'ఇంకెప్పుడూ ఆ పని చేయనులే. మొదట నీకు పెట్టిన తర్వాత ఆయనకు పెడతాను.'

సంజయ్ తల అడ్డంగా తిప్పాడు. 'ఆయనకి నువ్వు అన్నం పెడితే, నే నసలు అన్నం తినను. మానేస్తాను చూసుకో మరి! వేలుపెట్టి చూపిస్తూ బెదిరించాడు. వాడి రెండుబుగ్గలూ సాగలాగి నుదుటమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాను. వాడు నిద్రపోయేవరకూ, వాడి మంచంమీద కూర్చున్నాను.

నేను వంటయింట్లో సర్ది తలుపులు మూసి వచ్చేసరికి విజయ్ గదిలో పడక్కుర్చీలో పడుకుని వున్నాడు. అతని నోట్లో సిగరెట్

వెలుగుతోంది. అతను కూర్చున్న తీరు చూస్తే చాలాసేపటినుంచి నాకోసం వెయిట్ చేస్తున్నట్లుగా వుంది.

ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ నా పడకగదిలో సిగరెట్ వాసన వస్తోంది. అది నా కెంతో మధురంగా అనిపించింది.

కిటికీదగ్గరకి వెళ్ళి పరదాలు లాగబోతున్నదాన్నల్లా ఒక్క‌క్షణం ఆగాను. చుట్టుపక్కల అందరి యిళ్ళలో లైట్లు వెలుగుతున్నాయి. ఎన్ని రోజులు యిక్కడ నిలబడి ఏడ్చాను! అందరూ సుఖంగా వున్నట్లుగా అనిపించేది. ఈపూట, నా మనసులో భావం అందుకు పూర్తిగా, విరుద్ధంగా వుంది. ఈ ప్రపంచంలోవున్న ఆనందం అంతా నా యింటోనే నాట్యం చేస్తున్నంత పెరిసంతోషంగా వుంది.

కిటికీ తలుపులు మూశాను.

ఇంతలో నావెనక అలికిడి అయింది! తిరిగిచూస్తే నా వెనకగా దగ్గరగా విజయ్!

'రాధా! నువ్వేం మారలేదు. అప్పటికంటే, కొంచం లావు అయావు - అంతే! నువ్విలా కిటికీదగ్గర నిలబడటం చూస్తుంటే నాకు మొదటిరాత్రి గుర్తుకువస్తోంది' అతను హఠాత్తుగా ఎడంచేత్తో నా నడుం చుట్టూ చేయివేసి పొదివి పట్టుకున్నాడు. నా మెడ వొంపులో ముఖం దాచుకుంటూ ఆర్తిగా అన్నాడు.

'యుద్ధంలో బాగా గాయపడ్డాను. ఆపరేషన్‌చేసి చెయ్యి తీసేశారు. ఆ తర్వాత నేను పడిన వేదన వర్ణనాతీతం. ఆత్మహత్య చేసుకోవాలని అప్పుడప్పుడు అనిపించినా నేను పొందిన శిక్షణ నన్ను ఆపుచేసింది. నేను సైనికుడిని. చొరవ, ధైర్యం, ముఖ్యంగా పోరాడటం నాకు అలవాటు. ఎక్కడికైనా ఆశ్రమానికి వెళ్ళిపోదామా అని అనిపించేది. చివరకి - చివరకి నీదగ్గరకి రావటానికే నిశ్చయించుకున్నాను.

'విజయ్!' నేను రెండుచేతులతో అతన్ని దగ్గరకు లాక్కున్నాను.

'రాధా! ఇప్పుడు రెండోచెయ్యిలేని లోటు బాగా తెలుస్తోంది నాకు.'

'ఆమాట యింకెప్పుడు యెత్తకు' అతని తలని గుండెలకి అదుముకుంటూ అన్నాను.

* * *

విజయ్ వచ్చిన తర్వాత నా కొత్తకాపురం ప్రారంభమైంది. ఇంట్లో యిదివరకు యెన్నింటిలోనో, అశ్రద్ధగా వుండే విషయాలలో నాకు శ్రద్ధ, పుత్సాహం పుట్టుకురాసాగినాయి.

విజయ్ వచ్చిన తర్వాత నెలరోజులు శలవు అనంతరం, నేను మళ్ళీ కాలేజీలో జాయినయాను. ఈ నెలరోజులూ క్షణం విరామం లేకుండా గడిచింది. మేం బంధువుల యిళ్ళకి వెళ్ళటమూ, వాళ్ళు మా యింటికి రావటమూ జరిగేది. ఇవి కాక, సినిమాలు, షికార్లు, తిరుపతి, మద్రాసు ప్రయాణం ! అంతా ఆనందంగానే వుంది. కానీ సంజయ్‌దే ఒక సమస్య అయిపోయింది. వాడెందుకో విజయ్ అంటే విముఖత చూపించసాగాడు. విజయ్ వాడిని మాలిమి చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నా, అది సులభంగా నెరవేరటంలేదు.

సంజయ్ నిద్రపోయేవరకూ నేను విజయ్ గదిలోకి వెళ్ళేదాన్ని కాదు. ఒక్కరోజునకూడా సంజయ్ త్వరగా నిద్రపోయేవాడు కాదు. నన్ను కదలనిచ్చేవాడు కాదు. వాడిని నిద్రపుచ్చి వచ్చేసరికి, నా తలప్రాణం తోకకి వచ్చేది.

ఆరోజునకూడా అంతే చేశాడు. 'మమ్మీ ! ఈ కొత్త డాడీ మన యింటోంచి యెప్పుడు వెళ్ళిపోతాడు ?'

'ఎందుకనిరా ?'

'నాకు బాగాలేదు.'

'అలా అనకూడదు.'

'నువ్వేమో ఆ డాడీ వెంటే తిరుగుతావు. నాకు కథలు చెప్పటం మానేశావు.'

'చెబుతాగా !'

'ఆయన్ని వెళ్ళిపోమను.'

'ఇదిగో ఆమాట అనకూడదు అని చెప్పలా ?'

'ఇంకా అంటాను, డాడీ మా యింట్లోంచి వెళ్ళిపో' బిగ్గరగా అరిచేశాడు. నేను వాడి నోరు నొక్కేశాను.

'ఈసారి అలా అన్నావంటే చెంపలు వాయించేస్తాను జాగ్రత్త !' కసిరాను.

'నాకేం భయంలేదు. డాడీగా ! వెళ్ళిపోరా !' ఇంకా అరిచాడు.

'నేను సంజయ్ చెంపమీద బలంగా చరిచాను. 'చంపేస్తాను జాగ్రత్త — మళ్ళీ పిచ్చిమాటలు మాట్లాడుతావా ?'

అప్పటికే విజయ్ అక్కడికి వచ్చేసి గుమ్మంలో నిలబడ్డాడు.

'వాడు చిన్నపిల్లాడు. వాడికేం అర్థమవుతుంది. మనం నచ్చచెప్పాలి గాని. ఎందుకలా కొడ్తావు ?'

విజయ్ని చూడగానే సంజయ్ మంచంమీదనుంచి లేచి ఒక్కదూకు దూకి వెళ్ళాడు. విజయ్ని రెండుచేతులతో కొడుతూ, 'పో ! మా ఇంట్లోంచి పో ! పోతావా, పోవా ?' అంటూ కొరకసాగాడు.

'సంజూ !' నేను వెళ్ళి లాగి విడిపించాను.

"రాధా ! ఆవేశపడకు. వాడిని బుజ్జగించు. అర్థమయేలా చెప్పు, కేక లెయ్యకు. అలాచేస్తే నామీద వాడికి యింకా కోపం యెక్కువ అవుతుంది ! ప్లీజ్ !' అతను అర్థింపుగా అని సంజయ్వైపు చూసి వెళ్ళిపోయాడు. అతని కళ్ళలో సుడిపడ్తున్న బాధ చూస్తుంటే, నాకు జాలివేసింది. సంజయ్ని రెండు తన్నబుద్ధి వేసింది.

సంజయ్ ఆరాత్రి పొద్దుపోయేవరకూ నిద్రపోలేదు. మంచంమీద పడుకున్నాడు. ఒకసారి నేను లేచి విజయ్ గదిలోకి వచ్చాను.

అతను మంచంమీద పడుకుని వున్నాడు. నన్ను చూడగానే 'సంజూ నిద్రపోయాడా ?' అని అడిగాడు.

'లేదు !' అన్నాను.

'వాడు నిద్రపోయేవరకూ యిక్కడికి రాకు వెళ్ళు. వాడి ఎదుట అసలు నాతో యెక్కువ మాట్లాడకు.'

'కానీ —'

'ప్లీజ్, యింకేం ఎక్కువ మాట్లాడవద్దు. వెళ్ళు. వాడు మళ్ళీ లేచి వస్తాడు. వాడి కళ్ళలో అసహ్యం నేను చూడలేను.'

నేను తప్పనిసరిగా లేచి నాగదిలోకి వెళ్ళాను. సంజయ్ అటు యిటు మసులుతూనే వున్నాడు.

నేను వాడిదగ్గరే పడుకున్నాను. కాసేపటిలో నిద్రపోయాడు. నిద్రలో అమాయకంగా వున్న వాడిముఖం చూసేసరికి నాకు జాలివేసింది. చిన్నవెధవ ! వాడికి వూహ తెలిసినప్పటినుంచీ, నేను యింకే వ్యక్తిని వాడికంటే యెక్కువగా ఆదరించటం తెలియదు. ఇదివరకు నా కాలక్షేపం అంతా వాడితోనే వుండేది. ఇప్పుడది తగ్గిపోయింది. నేను విజయ్‌తో కబుర్లు చెబుతున్నా, నవ్వుతున్నా, మాట్లాడుతున్నా వాడికేమిటో చికాగ్గా వుంటుంది ! విజయ్ వాడిని మాలిమి చేసుకోవటానికి యింకా చాలారోజులు పట్టేట్టు వుంది.

సంజయ్ నిద్రపోయాడని స్పష్టంగా తెలుసుకున్న తర్వాత, నేను లేచి విజయ్ గదిలోకి వచ్చాను. అతను మంచం వెనక గోడకి తల అనించి చేరగిలబడి సుదీర్ఘమైన ఆలోచనలో మునిగివున్నాడు.

'చాలా ఆలస్యం అయిందా !' అన్నాను నొచ్చుకున్నట్లుగా చూస్తూ.

'ఫర్వాలేదు.'

నేను అతనిదగ్గరగా వచ్చి మంచంమీద కూర్చున్నాను.

'అబ్బా ! రేపటినుంచి మళ్ళా కాలేజీ ! బోర్ !' అన్నాను.

'షోసీ మానేయకూడదూ !'

'అమ్మో ! నాకు తొందరలోనే ప్రమోషన్ వస్తుంది' అన్నాను.

'మరి బోర్ అనటం దేనికి ?'

అతను నావైపే చూస్తున్నాడు.

నేను అతని ఛాతీమీద తల ఆనించాను. కొద్దిసేపటిలో నేను నిశ్చింతగా నిద్రపోయాను.

మర్నాడు నేను 10 గంటలకల్లా తయారయాను. ఆయా వచ్చి అప్పటికే, సంజయ్‌ని స్కూలుకి తీసుకుని వెళ్ళిపోయింది.

విజయ్‌కూడా త్వరగా స్నానంచేసి, నాతో కలిసి భోజనం చేసేశాడు.

నేను డ్రెస్ చేసుకుని పుస్తకాలు తీసుకుని అతనిదగ్గరగా వచ్చి 'వెళ్తున్నాను' అన్నాను. అతను క్షణంసేపు నావంక ఎగా, దిగా చూశాడు.

'ఏమిటి ? బాగాలేనా !' అన్నాను.

కాలేజీకి వెళ్ళేటప్పుడు నేను ముడి వేసుకుంటాను. పెద్ద బార్డర్స్ వున్న కాటన్‌గాని, కాశ్మీర్‌సిల్కుగాని చీరలు కట్టుకుంటాను. టీచర్ అంటే హుందాగా నిండుగా వుండాలని నా నమ్మకం.

'ఏమిటలా చూస్తావు ?' అన్నాను.

'నిన్నే !'

'ఏం బాగాలేనా ?'

'కాదు కొత్తగా కన్పిస్తున్నావు. ఎవరోలా వున్నావు.'

నేను నవ్వాను. ముందుకు వంగి, అతని పెదవులమీద గాఢంగా ముద్దు పెట్టుకుని, టాటా చెప్పి వెళ్ళిపోయాను.

నేను కారు తీసి గేటుదాటుతుంటే విజయ్ వచ్చి గేటు వేశాడు. అతను టాటా చెప్పాడు.

నేను ముందుకు వచ్చేస్తుంటే, వ్యూ మిర్రర్‌నుంచి అతను అలాగే గేటుపట్టుకుని నిలబడడం నాకు కన్పిస్తూనే వుంది.

నాకు చాలా గమ్మత్తుగా అనిపించింది.

కాలేజీలో కో లెక్చరర్స్ అంతా విజయ్ తిరిగి వచ్చినందుకు పార్టీ యివ్వాలని బలవంతం చేశారు. సరస్వతి అయితే మరీను ! ఎప్పుడు ఎక్కడ పార్టీ దొరుకుతుందా అని చూస్తుంది ! నేను అంగీకరించక తప్పలేదు. ఎల్లుండి ఆదివారం మా యింట్లో లంచ్‌కి ఆహ్వానించాను.

నేను సాయంత్రం రాగానే విజయ్‌కి యీ విషయం చెప్పాను. 'ఏమిటి! పార్టీయా! నన్ను అడగకుండా ఎందుకు చెప్పావు!' అన్నాడు.

'ఇందులో నిన్ను అడిగేదేముంది! ఇచ్చేదాన్ని నేను' అన్నాను.

'నన్ను అడిగేదేంలేదా! ఈ మొండిచేత్తో వాళ్ళందరి ముందుకు వస్తాననుకుంటున్నావా!'

'ఏమౌతుంది? ఈరోజు రాకపోతే రేపయినా నలుగురిలో తిరగాల్సిందే!'

'నీకు తెలియదు పూరుకో' కసిరినట్టుగా అన్నాడు.

'ఇందులో తెలియనిది ఏముంది?'

'చాలా వుంది. పార్టీలేదు. గీర్టీలేదు. కాన్సిల్ చెయ్యి' అనేశాడు.

నేను చాలా నిరుత్సాహపడ్డాను. పార్టీలో ఏమేమి కావాలోకూడా వాళ్ళ నాకు చెప్పేశారు. విజయ్ యిప్పుడు ఇలా అంటున్నాడు. ఏం చెయ్యటమా అన్న మీమాంసలో పడ్డాను.

నేను వెళ్ళి స్నానంచేసి బట్టలు మార్చుకుని, ముడివిప్పి జుట్టు రిబ్బన్‌తో కట్టుకువచ్చాను. విజయ్ నన్ను చూడగానే 'అమ్మయ్య! నా ప్రాణం యిప్పుడు హాయిగా వుంది' అన్నాడు.

'ఎందుకని ?'

'ఇంతక్రితం నిన్నుచూస్తే ఎవరోలా వున్నావు! ఇప్పుడేమో చిన్న పిల్లలా, నే నెరిగిన రాధలా – అప్పుడేమో వయసు వచ్చిన మనిషిలా, హుందాగా, బెరుకు కలిగించేట్టుగా వున్నావు!' అన్నాడు.

అతని ఒళ్ళో ఒదిగి అడిగాను.

'పార్టీ మాటేమిటి?'

'యిక ఆమాట ఎత్తద్దు.' అన్నాడు.

నాకు చాలా బాధ కలిగింది.

ఆవిధంగా మా దినచర్యలో, భావాల్లో చాలాసార్లు ఎగుడు దిగుళ్ళు రాసాగినాయి.

నేను కాలేజీకి పెళుతుంటే, మొదట్లోలాగా, విజయ్ తనుకూడా గబ గబా స్నానంచేసి, నాతో భోజనానికి రావటంలేదు.

బద్ధకంగా కూర్చునేవాడు. 'భోజనానికి రా' అంటే నేను తర్వాత తింటానులే అనేవాడు. నేను సాయంత్రం వచ్చేసరికి యిల్లు చూసి ఆశ్చర్య పోయాను. డైనింగ్‌టేబిల్ అంతా మూతలులేని గిన్నెలతో, ఎగిలి ప్లేట్లుమీద ఈగలు వాలుతూ అసహ్యంగా వుంది. విజయ్ సోఫాలోపడి నిద్ర పోతున్నాడు. పక్కనే బాటిల్ వుంది. అతన్ని లేపటం నాతరం కాలేదు. క్రింద అంతా సిగరెట్ పీకలు, నుసి, ఇల్లు శుభ్రంచేసేసరికి నా తాతలు దిగివచ్చారు.

అసలే కాలేజీలో మాట్లాడి, అలిసిపోయి వచ్చానేమో, యింటిదగ్గర యింతపని ఎదురయేసరికి ఏడుపు వచ్చేసింది.

మర్నాడు, విజయ్‌తో చెప్పేశాను. 'విజయ్ పనిమనిషికూడా రావటం లేదు. కాలేజీనుంచి వచ్చి అన్నం వండటమే నాకు గగనం అవుతోంది.'

'అంటే ?'

'నేను వచ్చేసరికి నాకు యింటిదగ్గర వేరేపని పెట్టకు' అతను మాట్లాడలేదు.

ఆ సాయంత్రం నేను వచ్చేసరికి, విజయ్ యింట్లోలేడు. పక్కింటి అమ్మాయి తాళంచెవి తెచ్చి యిచ్చింది. అతను వుదయమే పెళ్ళాడుట.

నేను యింట్లోకి అడుగుపెట్టాను. థ్యాంక్ గాడ్ ! యిల్లు ఎక్కడ సర్దిన సామాను అక్కడే వుంది. నాకు సంతోషం కలిగింది. డైనింగ్‌రూమ్ లోకి వచ్చిన నేను టేబిల్‌మీద ఆ గిన్నెలు చూడగానే వులిక్కిపడ్డాను ! విజయ్‌కోసం నేను పెట్టిన ప్లేట్ అలాగే వుంది. గిన్నెలుతీసి చూశాను. విజయ్ అన్నం తినలేదు ! ఉదయంనుంచి ఎక్కడకు పెళ్ళాడో !

విజయ్ ఎక్కడకి పెళ్ళి వుంటాడు ! తెలిసినవాళ్ళకి ఫోన్ చేశాను ! ఎవరూ, రాలేదని చెప్పారు. రమణ ఇంటికి పెళ్ళాను. అక్కడకీ రాలేదు. రమణని తీసుకుని అతని ఫ్రెండ్స్‌దగ్గరికి పెళ్ళాను. అక్కడకూడాలేడు. నాకు చాలా భయంవేసింది.

రమణ, నేను ఇంటికి వచ్చాం! 'భయపడకు వదినా, ఎక్కడో ఒకచోట క్షేమంగానే వుంటాడు' అన్నాడు.

ఇంతలో ఫోన్ మోగింది. విజయ్ బార్‌లో తాగి పడివున్నాడట! రమణ స్నేహితుడు ఒకఅతను ఫోన్ చేశాడు. నేను రమణ వెళ్ళాం. విజయ్ మత్తులో ఏదో అంటున్నాడు. మాట మృదుగావుండటంవల్ల నా కర్థం గాలేదు. ఆ స్థితిలో అతన్ని చూడగానే నాకు భయంవేసింది. ఏడుపు వచ్చేసింది.

రమణ సాయంతో యింటికి చేర్చాను.

మర్నాడు నేను కాలేజీకి వెళ్ళలేదు. విజయ్ నన్ను అడిగాడు.

'వెళ్ళాలనిపించటంలేదు' అన్నాను ముక్తసరిగా.

'ఎందుకని?' రెట్టించాడు.

నేను జవాబు చెప్పలేదు.

అతను పడుకునే వున్నాడు. 12 గంటలు అవుతుండగా భోజనానికి లేచి రమ్మనమని పిలిచాను. 'నాకు ఆకలిలేదు అన్నాడు.'

'ఎందుకనీ?'

'ఒంట్లో బాగాలేదు. నన్ను మాట్లాడించకు, అవతలకి వెళ్ళు.'

నేను దగ్గరికివెళ్ళి మీదచేయి వేశాను. 'నీబాధ ఏమిటో నాకు చెప్పకూడదూ!' అనునయంగా అడిగాను.

అతను మాట్లాడలేదు.

'నాకు చెబితే దానికి తగ్గేవుపాయం చెబుతానుగా.'

'నువ్వు చెప్పలేవు.'

'నీకు ముందే తెలుసా?'

అతను తెలుసు అన్నట్టు తలతిప్పాడు.

'విజయ్! నానుంచి దాచటం నీకు న్యాయంకాదు! నేను దాన్ని పరిష్కరించలేకపోవచ్చు. కానీ నీ బాధని పంచుకోగలనుగదా?'

'రాధా! నువ్వు వుద్యోగం చేయటం నాకిష్టంలేదు. మానేస్తావా?'

నేను నిరుత్తరురాలిని అయాను.

'మన — మన యిల్లెలా గడుస్తుంది?' అస్పష్టంగా అన్నాను.

'నేనే ఏదో మార్గం చూస్తాను' అతను లేచి హఠాత్తుగా ఆ ఎడమ చేత్తోనే నన్ను గట్టిగా పట్టుకున్నాడు. 'నువ్వు నాకు తెలిసిన రాధగా, నేను యుద్ధానికి వెళ్ళకముందు రాధలాగానే వుండు. తెలిసిందా! డబ్బు చాలకపోతే కారు అమ్మేద్దాం! పస్తులు పడుకుందాం!'

అతని ఆవేశానికి చిత్రంగా నా మనసు స్పదించలేదు. నేను నిటారుగా, చలనం లేకుండా అలాగే వుండిపోయాను.

'విజయ్! నన్ను ఆలోచించుకోనీ' అన్నాను.

ఆరోజున యిద్దరం వేరు వేరు గదుల్లోనే పడుకున్నాం! వుద్యోగం వదిలేయాలా! కారు అమ్మివేయాలా! పస్తులు పడుకోవాలా! విజయ్ మతివుండే చెబుతున్నాడా! అది జరిగేపనేనా! అతనేదో ఆవేశంలో వున్నాడు. నేను కాలేజీకి వెళ్ళిపోతే ఒంటరితనం తట్టుకోలేక అనుకునే మాటలవి! వాటికి నేను విలువ యిస్తే ఎలా! నేను వుద్యోగం మానేస్తే అసలు ఎలా జరుగుతుంది.

మర్నాడు నేను మామూలుగానే తయారై బయలుదేరాను. డ్రస్ చేసుకుని, ముడివేసుకుని, పుస్తకాలు పట్టుకుని అతనిముందు వచ్చి నిలబడ్డాను.

"నేను_' తడబాటుగా క్రిందకి చూస్తూ అన్నాను.

'రాధా! కాలేజీకి వెళ్ళు! రాత్రి నేను ఆవేశంలో అనేశా! ఐయామ్ సారీ! నా మాట వెనక్కు తీసుకున్నాను.' అతని గొంతు క్షమార్పణగా వుంది.

ఆరోజు కాలేజీకి వచ్చానన్న మాటేగాని, నా మనసు మనసులోలేదు! విజయ్‌ని సంతృప్తిపరచలేకపోయాను అనే బాధకలగసాగింది. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే అది అసాధ్యం! కానీ ఎమోషనల్‌గా ఆలోచిస్తే అది నిజం! జీవితంలో కొన్ని కొన్ని సమయాల్లో భావోద్వేగం కంటే, ప్రాక్టికల్

విషయాలకే ప్రాధాన్యత యివ్వాలి. ముఖ్యంగా ఆడవాళ్ళు! లేకపోతే జీవితంలో యదార్థం ఎదురయ్యేసరికి నిలవరించుకోలేని ఎదురుదెబ్బలు తగులుతాయి.

ఆరోజునుంచీ, నాకు విజయ్‌కిమధ్య ఒక ఎడంలాటిది ప్రారంభ మైంది. విజయ్ వచ్చిన తర్వాత, మా యింటి ఆవరణలో రంగు, రంగు పూలమొక్కలు చివుళ్ళు తొడగటం ప్రారంభించినాయి. అతను ఒక్కక్షణం కూర్చోడు. ఉన్న ఆ ఒక్కచేత్తోనే ఏదో ఒకపని చేస్తూనే వుంటాడు. ఆ ఎడంచేత్తోనే ఉదయంపేళ, మొక్కల్లో తవ్వుతూ పనిచేస్తాడు. ఆ ఎడం చేత్తోటే పక్కింటిపిల్లల్ని పిలిచి టెన్నిస్ ఆడటానికి ప్రయత్నిస్తాడు. అతన్ని చూస్తూంటే, ఆ ఒక్కచేతికే రెండుచేతుల బలం వచ్చిందా అనిపిస్తుంది.

కారుది మాకు పెద్దసమస్య అయిపోయింది! ఉదయం నేను కాలేజీకి తీసుకుపెళితే, అతను పనిమీద పెళ్ళాలంటే ఆటోలోనో, బస్సులోనో పెళ్ళాలి. ఆటోలో పెళ్ళమంటే పెళ్ళడు. బస్సులోనే పెళ్తాడు. బస్‌స్టాప్‌దగ్గర అంతసేపు ఎందుకు నిలబడటం? అని నేను అంటే, 'కాలక్షేపంగా వుంటుంది' అనేవాడు.

విజయ్ లేనప్పుడు 3½ సంవత్సరాలు ఒంటరిగావున్న నేను, కావాలని పెంచుకున్న పరిచయాలు యిప్పుడు యిబ్బందికరంగా అయినాయి! నా కో లెక్చరర్స్ చీటికి, మాటికి ఫోన్ చేయటం అలవాటు! నేను వాళ్ళని ఎంత వదిలించుకోవాలన్నా ఫోన్‌లో కనీసం అరగంటయినా పట్టేది. శలవులు వస్తే, చెప్పాపెట్టకుండా బిలబిలలాడుతూ వచ్చేసేవారు! ఒకటే కబుర్లు, నవ్వులు. ఎంత చెప్పినా పడకగదిలో విజయ్ వున్నాడని మర్చిపోయేవాళ్ళు. నాకు ముందు వాళ్ళ రాకని తెలియపరిస్తే ఒంట్లో బాగాలేదనో, పనివుందనో వంకబెట్టి తప్పించుకునేదాన్ని! కానీ సరాసరి వచ్చేసేవాళ్ళతోనే చిక్కు వచ్చేది. అందులో సరస్వతి, ఉమ బాచిలర్ గరల్స్! వాళ్ళకి ఆదివారంవస్తే తోచదు.

వీళ్ళు కాకుండా, రమణ, దుర్గ తరచు వస్తూ వుండేవారు. ఒకసారి దుర్గ నన్ను డబ్బు అప్పు అడుగుతోంది. 'అక్కగారూ! నేను మిమ్మల్ని

అడగకూడదనే అనుకుంటాను. కానీ పరీక్షగా అవసరాలు అప్పుడే వస్తాయి. ఏం చెయ్యను ?'

ఇదివరకు నాకు ఖర్చులు తక్కువ వుండేవి. చేతిలో డబ్బులు బాగా మిగిలేవి! దుర్గ అడగగానే యిచ్చేదాన్ని. ఇప్పుడు నా ఖర్చులు పెరిగినాయి. ఎప్పటికప్పుడే ఏదో ఒకఖర్చు రావటంతో, డబ్బుకి ఫస్టుముందు తడబాటుగానే వుంది.

'ఏమీ అనుకోకు దుర్గా, లేదు' అంటూ నా పరిస్థితి చెప్పాను.

దుర్గ స్వభావం ఎప్పుడూ పెళుసే! నా యీ మాటని ఒకసారి విజయ్‌దగ్గర, విజయ్ వచ్చిన తర్వాత యింటి ఖర్చులు పెరిగినాయని నేను బాధపడిపోతున్నట్లుగా చెప్పేసింది! దుర్గవేసిన యీ నిప్పురవ్వ పెద్దగా ప్రజ్వరిల్లి భగ్గున మండింది.

విజయ్ నేను అలా అనలేదు అంటే నమ్మలేదు. అతను రాజీకి రావటానికి వారంరోజులు పట్టింది.

విజయ్ చిన్నతనంలోనే మిలట్రీ ట్రయినింగ్‌కి వెళ్ళిపోయాడు. అతనికి జీవితంపట్ల చాలా ఖచ్చితమైన అభిప్రాయాలు వున్నాయి. లౌక్యం అంటే చిరాకు! ఎందుకా నటన అంటాడు.

అతను చేసే పనేం లేకపోయినా, ఉదయం 5 గంటలకల్లా లేచేసేవాడు! కాసేపు వ్యాయామం చేసేవాడు! బంధువు లెవరైనావస్తే వాళ్ళు త్వరగా లేవకపోతే అతనికి చిరాకు వచ్చేది.

మా పాలమనిషి వారానికి ఒకసారి బాగా తిట్టి మానిపించేస్తాను అని బెదిరిస్తేగాని, నాలుగురోజులు పాలు చిక్కగా పోయదు. తర్వాత మళ్ళీ మామూలే! విజయ్‌కి యిది చిరాకు!

'దాన్ని బ్రతిమలాడతా వెందుకు! మానిపించేయరాదూ' అంటాడు.

'ఆ! ఇంకోమనిషి దొరకవద్దూ!'

'అదీ! వెతకటానికి బద్ధకం అని చెప్పు. రాధా! అసలు నీ కింత పిరికితనం ఎందుకో నా కర్థం గావటంలేదు! నువ్వు డబ్బు యిస్తున్నావు.

యిచ్చిన డబ్బుకి మంచివస్తువు అడగటానికి భయం దేనికి ?' అతని వాదన అర్థంలేనిది ! నీళ్ళపాలు మనకి ఒక్కరికే పోస్తుంటే అది అడగలేకపోతే పిరికితనం అనుకోవచ్చు ! దేశంలో పాలవాళ్ళంతా అంతే ! పోయించుకునే వాళ్ళంతా నోరులేక పోట్లాడటంలేదా ! ఏదో ! చూసీ చూడనట్టు సర్దుకుపోవాలి ! విజయ్ చెప్పినట్టు చేస్తే ఉదయం లేచినప్పటినుంచి రాత్రి పడుకోబోయేవరకూ, అందరితో పోట్లాడాల్సివస్తుంది !

ఆరోజు సాయంత్రం కాలేజీనుంచి వచ్చి ముఖం కాళ్ళు చేతులూ కడుక్కుంటుంటే, పక్కింటి పనిమనిషి వచ్చింది ! 'మా అమ్మగారు మీతో అర్జెంటుగా మాట్లాడాలిట. రమ్మంటున్నారండీ !' అంది.

'ఆవిడనే కాసేపు రమ్మనమని చెప్పు.'

'ఆరు రారండీ, కోపంమీద వున్నారు.' అంది.

'ఎందుకు ?' అన్నాను.

'మీరే రండి. చెబుతారు. పొద్దున, మీ రెళ్ళిన తర్వాత పెద్దభాగోతం అయిందిలెండి' అంది.

పక్కింటి ఆవిడ పోట్లాడేమనిషికాదు ! అసలేమిటో, ఏమైందోనని వెళ్ళాను.

'కూర్చో రాధా' అంటూ ఆవిడ మొదలుపెట్టింది. 'మనం యిరుగు, పొరుగూగా వుండటం మొదలై ఎన్నాళ్ళయింది ?'

'మూడేళ్ళ పైనే అయింది' అన్నాను.

'ఏనాడయినా మీరు, మేము మాటా మాటా అనుకున్నామా ! పైనుంచి నీవు ఒంటరిదానివని నేను, పిల్లలు ఎంత సాయంగా వున్నాం.'

నేను తలవూపాను. మంచి పొరుగు వుండబట్టే, వాళ్ళతో నేను మన్ననగా వుండబట్టే, యింట్లో నాకు యింకో తోడు లేకపోయినా వుండగలిగాను. ఆ మాట నిజమే !

'ఒకసారి మీ సంజయ్‌కి డిఫ్తీరియావస్తే, మావారు, నేనూ ఎంత తల్లడిల్లిపోయాం ! మా పెద్దాడు డాక్టరుకోసం ఎలా పరుగెత్తాడు.'

నేను తలవూపాను. ఆరాత్రి వాళ్ళు చేసిన సహాయం నేను జన్మలో మర్చిపోలేదు.

'ఇప్పుడేమయిందండీ ?' అనునయంగా అన్నాను.

'ఏమయిందా ! మీ ఆయన మాకోళ్ళు వచ్చి మీ మొక్కలు పాడుచేశాయని, వాటిని పట్టుకుని పనిమనిషికి యిచ్చేశాడు. అదేమంటే నా కొడుకుని కొట్టొచ్చాడు'

'అయ్యయ్యో ! నే కనుక్కుంటాలెండి' నొచ్చుకుంటూ అన్నాను.

'మీ ఆయన ఎక్కడినుంచయినా దిగివచ్చానని అనుకుంటున్నాడేమో ! మావాళ్ళూ చేశారు ఇంతకంటే గొప్ప గొప్ప వుద్యోగాలు. విర్రవీగవద్దని చెప్పు. ఒక చెయ్యి లేని ఆయనకే అంత జబ్బసత్తువ వుంటే, రెండుచేతులున్న మావాడికి ఎంతబలం వుంటుందో ఆలోచించుకోమను.'

ఈమాట వినగానే నా మనసు చివుక్కుమంది. ఆవిడ విజయ్ అవిటితనాన్ని హేళన చేస్తుంటే, బాధ కలిగింది.

'నేను చెబుతాలెండి. ఇంకోసారి యిలా జరగకుండా చూస్తాలెండి' అన్నాను.

'ఇంకోసారా ! ఈసారికి నీముఖం చూసి వూరుకున్నాం. ఇంకోసారి యిలాగే వూరుకుంటామని అనుకోవద్దు ! నీతో మాకున్న అభిమానాన్నిబట్టి యీరోజు ఆయన మావాడి చేతుల్లో పడకుండా బైటపడ్డాడని అనుకో ! జాగ్రత్త ! కాస్త భర్తని కంట్రోల్‌లో పెట్టుకో !'

ఆవిడ తత్వమే అంత ! స్నేహంగా వుంటే ఎంత చేస్తుందో, కోపం వస్తే అంత ఢడామడా అనేస్తుంది.

అసలు విజయ్‌దే తప్పు !

ఈ కోళ్ళ తగాదా నెలరోజులుగా రగులుతూనే వుంది. పక్కింటి కోళ్ళు వచ్చి, విజయ్ పోసిన పూలనారు, కూరగాయలనారుని తొక్కేస్తుంటాయి ! ఎరువు వాసనకి పురుగులేమైనా దొరుకుతాయేమోనని కుళ్ళగిస్తుంటాయి. విజయ్ వాళ్ళకి చాలాసార్లు చెప్పాడు. వాళ్ళు రాకుండా

చూస్తుంటామని చెబుతూనే వుంటారు. అవి వస్తూనే వుంటాయి. ఈసారి వస్తే పట్టుకుని వదలను అని విజయ్ చెప్పేవాడు.

ఈరోజు మధ్యాహ్నం వచ్చినాయిట! విజయ్ పట్టుకుని పనిమనిషికి యిచ్చేశాడు. ఆవిడ అడిగితే కేకలేశాడు. మాటామాటా పెరిగింది! ఆవిడ కొడుకు వచ్చాడు. చేయి విసురుకునేవరకూ వచ్చింది. 'అతనితో మన కెందుకులేరా! రాధమ్మ రానీ, రాధకి చెప్పి తర్వాత చూద్దాం' అని కొడుకుని శాంతింపచేసి లోపలకి లాక్కెళ్ళిపోయింది.

నేను యింటికి తిరిగి వచ్చాను. విజయ్ వరండాలోనే ఎదురయాడు. ఇద్దరం ఒకరిని ఒకరు చూసుకున్నాం.

'అయినాయా నామీద ఫిర్యాదులు వినటం' అన్నాడు. నేను మాట్లాడలేదు.

నేను పనిమనిషిని పిలిచి, కోళ్ళు తెప్పించి పక్కింటావిడకి యిచ్చేశాను, విజయ్ అప్పటికి యింట్లోలేడు. ఇంటికి రాగానే సంజయ్ చెప్పాడు. ఇప్పుడిప్పుడే వాళ్ళిద్దరూ ఫ్రెండ్స్ అవుతున్నారు.

'నువ్వేంచేశావో తెలుసా?' అన్నాడు విజయ్!

నేను మాట్లాడలేదు.

'మాట్లాడవేం?'

'ఏం మాట్లాడను!'

'నాకు యీ యింట్లో స్థానం వుందా లేదా?'

'వుంది అనుకుంటే వుంది. లేదు అనుకుంటేలేదు' నేను చాలా సహనం కూడదీసుకుని, నచ్చచెబుతున్నట్టుగా చెప్పాను. 'విజయ్! నువ్వు అన్నింటికీ అనవసరంగా ఆవేశపడటం తగ్గించుకోవాలి! ఇరుగు, పొరుగున వుండేవాళ్ళం! సర్దుకుపోవటం అనేది తప్పదు. నువ్వు లేనప్పుడు వాళ్ళు నాకు ఎంత సాయం చేశారో తెలుసా?' అంటూ సంజయ్ సు స్త్రీ సంగతి చెప్పాను. అంతా విన్న విజయ్ చిరాగ్గా చూస్తూ 'దానికీ, దీనికీ ఏం సంబంధం రాధా! వాళ్ళు నీకు సాయంచేస్తే, నువ్వుకూడా సాయంచెయ్యి.

అంతేగాని సాయంచేశారనే నెపంతో, వాళ్ళు చేసిన పెధవపనికి తల వంచుతావా?'

'విజయ్! నువ్వు ఒక్కటి ఆలోచించు! నువ్వు సంవత్సరాలుగా పెరిగిన ఆ మిలట్రీ వాతావరణం వేరు. అక్కడ డిసిప్లిన్ మీకు ప్రాణం, ప్రతివ్యక్తి దాన్ని పాటిస్తాడు! ఇక్కడ అది శూన్యం! సమాజానికి రూల్స్ రెగ్యులేషన్స్ అనేవి నామమాత్రమే! ఎవరికి యిష్టం వచ్చినట్టు వాళ్ళు చేస్తారు. ఇక్కడ బలంవున్నవాడిది రాజ్యం! మొన్న నువ్వేం చేశావు. మన వీధిని చిరాకు చేసేస్తున్న ఆ చెత్తకుండీని, వీధి చివరన ఎక్కడ అయినా వుండేట్టు చేయమని, మున్సిపాల్టీకి రిపోర్టు చేశావు. ఎవరైనా నీ మొర ఆలకించారా! నువ్వు ఎంతో ప్రయత్నించి, వీధి చివర వేయిస్తే, మళ్ళీ మర్నాటికి అది యధాస్థానంలోకి వచ్చింది. ఇలాటివి ఎన్నో! మీరు మిలట్రీలో, వ్యక్తిగతంగా ఆలోచించరు, ఎంతసేపూ పదిమంది క్షేమం ఆలోచిస్తారు. ప్రాణాలు యిస్తారు. యిక్కడ ఎవరి సుఖం వాళ్ళది! ఎదుట వారి బాధలు లక్ష్యపెట్టరు.'

విజయ్ నావంక చూస్తూ నిలబడిపోయాడు. అతను ఆ సమయంలో లెక్చరర్ చెప్పే పాఠం అర్థంగాని విద్యార్థిలా కన్పించాడు నాకు. విజయ్‌కి, నాకు మధ్య యిలాటి చిన్న చిన్న స్పర్థలు ప్రజ్వరిల్లటానికి ప్రయత్నిస్తుంటే, నేను నేర్పుగా, సహనంతో, చాకచక్యంతో వాటిని ఆర్పివేయటానికి ప్రయత్నించసాగాను.!

విజయ్ ఆరాటం నాకు బాగానే అర్థమైంది. సంవత్సరాలుగా క్రమశిక్షణకి అలవాటుపడిన అతను, ఆ మాటే ఎరుగనట్టు ప్రవర్తించే యీ సమాజంలో యిమడలేకపోతున్నాడు. ఇక్కడ సోమరిపోతుతనం, బాధ్యత లేనితనం, బేపర్వాతనం చిక్కటితాళ్ళలా జనం జీవితాల్లో అల్లుకుని వున్నాయి. వాటిని ఎవ్వరూ ఛేదించలేరు! వీళ్ళకి డిసిప్లిన్ నేర్పటం అనేది ఆ భగవంతుడి తరంకూడా కాదేమో!

రమణ చేస్తున్నది చిన్న వుద్యోగం. అతని అత్తగారు, బావమరిది, మరదలు యితనిదగ్గరే వుంటారు. ఒకరోజు దుర్గ, రమణ మా యింటికి

వచ్చినప్పుడు, మాటల సందర్భంలో విజయ్ అనేశాడు. 'రమణా! మీ అత్తగారూవాళ్ళు మీ యింట్లో తిష్టవేశారేమిట్రా? నీ బావమరిది వుద్యోగం లేకుండా అలా ఎన్నాళ్ళు తిరుగుతాడు!'

ఈమాట వినగానే రమణముఖం వెలవెలాపోయింది. అతను దుర్గకి భయపడతాడు. నేను గమనిస్తూనే వున్నాను. దుర్గ కళ్ళు అప్పటికే ఎర్రబడినాయి.

విజయ్ అంతటితో వూరుకోలేదు. 'ఏం దుర్గా! నీకయినా ఆమాత్రం బుద్ధి వుండద్దూ! వాడి జీతం ఎంత? మీ ఖర్చులేమిటి? రమణ మొహమాటం నీకు తెలుసు. నువ్వయినా మీ అమ్మావాళ్ళకి చెప్పవద్దూ?'

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత, నేను అన్నాను. 'వాళ్ళ యింటి విషయాలు నీకెందుకు?'

'నాకెందు కేమిటి? రమణ నాకు తమ్ముడు కాదా!'

'రమణ చెప్పుకోలేడా!'

'చెప్పుకునేవాడయితే యింతకాలం భరిస్తాడా! మొన్న చెప్పాడు. పదివేలు అప్పులు వున్నాయి. వాడి పిల్లలు యిద్దరూ చిన్నవాళ్ళు ఏ ఖర్చులు చేశాడని వాడికీ అప్పు! ఏరా అంటే మాట్లాడడు!'

'విజయ్ నోటిమాట బైటపడిందేగాని, రమణ అత్తగారూ, బావమరిది యింట్లోంచి కదలనేలేదు. ఆ మాట విజయ్ అన్నందుకు ఫలితం ఏమిటంటే రమణకీ, మాకు రాకపోకలు బంద్ అయినాయి. దుర్గ అందరిదగ్గరా, 'మా సంసారంజోలి వీళ్ళకెందుకు? వాళ్ళ కాపురం తీరుగా ఏడిసింది కనకనా!' అంటూ మమ్మల్ని దుయ్యబట్టింది. 'మేం మా అల్లుడిదగ్గర తింటుంటే ఈయనకి ఎందుకుట! ఆయనకి ఒంటినిండా పనిలేక, పెళ్ళాం తెచ్చినది తింటూ, మామీదపడి ఏడుస్తున్నాడు' అంటూ దుర్గ తల్లి నానా శాపనార్థాలు పెట్టింది. ఈ మాటలు వినలేక నా చెవులు చిల్లులుపడినాయి. ఇదివరకూ 'వదినా వదినా' అంటూ ఎంతో అభిమానంగా, ప్రాణం ఇచ్చేట్టుగా వుండే రమణ యిప్పుడు ఎక్కడైనా కన్పిస్తే తప్పుచేసినవాడిలా ముఖం తిప్పుకుని వెళ్ళిపోతున్నాడు.

విజయ్ ప్రవర్తన మూలంగా, క్రమంగా నాకు స్నేహితులూ, బంధువులూ దూరం అయిపోసాగారు.

ఇదివరకు విజయ్ లేనప్పుడు నాకున్న ఒంటరితనం కేవలం మానసికం మాత్రమే! ఇప్పుడు నేను బాహ్యంగా అందరికీ దూరమైనట్టు ఫీలవుతున్నాను. దాదాపు అందరూ మా యింటిని వెలివేసినట్టే చూస్తున్నారు.

విజయ్ వచ్చిన కొత్తల్లో సంజయ్ పుట్టినరోజు అయింది! పిలిచిన వాళ్ళందరూ వచ్చారు. ఆరోజు ఎంతో సరదాగ గడిచింది. కబుర్లతో, నవ్వులతో యిల్లు హోరెత్తిపోయింది.

ఈరోజు సంజయ్ పుట్టినరోజు అయింది! అందరినీ పిలిచాను! ఇదివరకులాగానే, ఏర్పాట్లు చేశాను. కానీ ఒక్కరూ రాలేదు. నాకు చాలా బాధకలిగింది. విజయ్, నేనే మిగిలాం! సలభై మందికి కావాలని తెచ్చిన కేక్స్, స్వీట్లు నేను, విజయ్, సంజయ్ మాత్రమే తిన్నాం! నాకు చెప్పలేని దిగులు కలిగింది. నాది అందరితో కలిసిమెలిసి వుండే మనస్తత్వం! ఎవ రెలాపోతే నాకెందుకులే అని, నాపని నేను చూసుకునే స్వభావం! విజయ్ అలాకాదు! చుట్టూ వారిని గమనిస్తాడు. వాళ్ళుకూడా తనలాగానే వుండాలని అనుకుంటాడు! చెడు కనిపిస్తే దాన్ని ఛేదించాలని తాపత్రయ పడతాడు. అతను ఒకవిధంగా, క్రమశిక్షణలేని యీ వాతావరణంలో యిమడలేకపోతున్నాడు అనిపిస్తోంది! అతని స్వభావానికి యదార్థానికి తీవ్రమైన యుద్ధం జరుగుతున్నట్టుగా గ్రహించగలిగిన నేను, అతన్ని ఏమీ అనలేకపోతున్నాను.

విజయ్ ఎప్పుడూ గుడికిరాడు.

ఆరోజు నా ప్రోద్బలంమీద గుడికి బైలుదేరాడు. ఈమధ్య విజయ్ చాలావరకూ నాతో ఎక్కడికైనా రావడం బాగాతగ్గించివేశాడు. ఎందుకంటే, ఎక్కడికైనా కారు నేను డ్రైవ్ చేయాల్సివస్తుంది! అందుకు అతనికేం అభ్యంతరంలేదు! కానీ, బజారులో వాళ్ళు మమ్మల్ని విచిత్రంగా చూస్తుంటారు. అది అతనికి చిరాగ్గా వుంటుంది.

సాధారణంగా, గుడికి రా అంటే, మామూలుగా అయితే అతను తిరస్కరించే వాడేమో ! ఈరోజు అతని మనసుకూడా బాగాలేదు ! సంజయ్ పుట్టినరోజుకి పిలిస్తే ఎవరూ రాకుండా మమ్మల్ని అవమానపరిచారు. నేను అది అవమానంగా తీసుకోలేదు. వాళ్ళ మనసుకి మామూలంగా కష్టం కలిగి వుంటుంది. అందుకే రాలేకపోయారు, అని సరిపెట్టుకున్నాను. విజయ్ అలా అనుకోలేకపోతున్నాడు. వాళ్ళు కావాలనే అవమానించారంటున్నాడు. ఈస్థితిలో అసలే కలత చెందివున్న నన్ను మరింత నిరాశపరచటం యిష్టం లేక నేను అడిగిన వెంటనే నాతో గుడికి బైలుదేరాడు.

మేం గుడిదగ్గరికి వచ్చేసరికి చాంతాడంత క్యూ వుంది ! నాకు తెలిసిన పూజారి ఒకతను వున్నాడు. అతని కూతురు, నా స్టూడెంటే ! నన్ను చూడగానే అతను వచ్చి ఆదరంగా పలకరించి, వేరే దోవగుండా తీసుకువెళ్ళి త్వరగా దర్శనం చేయిస్తానని రమ్మనమని చెప్పాడు.

ఇది నాకు ఎప్పుడూ అలవాటే ! విజయ్ ఆమాట వినలేదు.

'ఇది గుడి ! అందరూ యిక్కడ సమానమే ! అందరినీ సమంగా చూడాల్సిన మీరే యిలా, ఆధిక్యతలూ, ప్రత్యేకతలూ చూపిస్తే ఎలా ! ఆ క్యూలో నిలబడినవాళ్లు మాత్రం మాలాటివాళ్ళుకాదా ! ఇలా మీరు మాలాటి కొంతమందిని పక్కదోవన దేవుడిదగ్గరకి త్వరగా తీసుకువెళితే, వాళ్ళకి యింకా ఆలస్యం అవుతుంది. అంటే, అన్యాయం అనేది యిక్కడా పుడుతోందన్నమాట ! నేనిది రిపోర్టుచేస్తే మీ వుద్యోగం ఏమౌతుందో తెలుసా ?' తీక్షణంగా అడిగాడు. పూజారి తికమకగా చూశాడు. భయపడ్డాడు! తడబడిపోయాడు ! దణ్ణం పెట్టేసి 'వస్తాను' అని గబగబా వెళ్ళిపోయాడు.

నేను, సంజయ్, విజయ్ క్యూలో నిలబడ్డాం ! ఆ క్యూ ఎంతసేపటికీ కదలటంలేదు ! నిలబడి నిలబడి కాళ్ళు నొప్పులు పుట్టాయి. అలసట వచ్చేసింది. సంజయ్ యింటికి వెళ్ళిపోదామని ఏడుపు ప్రారంభించాడు ! నాక్కూడా ఎప్పుడు యింటికి వెళ్ళిపోతానా అని వుంది ! కానీ గుడికివచ్చి దేవుడిని చూడకుండా వెళ్ళటమా ! నావల్లకాదు. అనిపించింది. ఓపిక తెచ్చుకుని నిలబడ్డాను.

క్యూ నత్తనడకలా కదిలింది! ఎలాగయితేనేం దేవుడికి దగ్గరగా వస్తున్నాం అనే ఆనందం కలిగింది. కానీ ఆ ఆనందం ఆట్టేసేపు నిలవలేదు. మాకు యింకా ఫర్లాంగుదూరం వుండగా టైమ్ అయిపోవడంతో తలుపులు మూసేశారు.

నా ప్రాణం వుసూరుమంది! విజయ్‌మీద అంతులేని కోపం వచ్చింది.

'ఛీ! ఎప్పుడూ యింతవరకూ, దేవాలయానికి వెళ్ళి యిలా తిరిగి రాలేదు!' తిరిగి వస్తుండగా సణిగాను.

'నీకు దేవుడిని చూడలేదని దిగులుగా వుందేమో! నాకు అక్కడ మనం అన్యాయమైన పనిచేయలేదని సంతృప్తిగా వుంది' అన్నాడు విజయ్.

'నువ్వుచెప్పినట్టు బ్రతకాలంటే, జనం ఢామ్మని చస్తారు' కసిగా అన్నాను.

'అదేమిటి?' అతను ఆశ్చర్యంగా అన్నాడు.

'అది అంతే! చెప్పినా నీకు అర్థంగాదు' పళ్ళబిగువున అన్నాను.

నేను విజయ్ వచ్చిన కొత్తలో దేవాలయానికి వెళ్ళాను. ఆరోజు అసలు రద్దీలేదు. పూజారికి కొబ్బరికాయ, పువ్వులు యిచ్చి గంటకొట్టి శ్రద్ధగా చేతులుజోడించి, కళ్ళుమూసుకుని దణ్ణంపెట్టాను. నేను కళ్ళు తెరిచేసరికి సంజయ్‌కూడా దణ్ణంపెట్టి కళ్ళుమూసుకున్నాడు. విజయ్‌మాత్రం అలాగే చూస్తున్నాడు.

'దణ్ణం పెట్టవేం' అన్నాను.

'ఎలా పెట్టను?' చెయ్యి ఒక్కటే వుందని ఎడంచెయ్యి ఎత్తి చూపించాడు. నాకు భలే జాలేసింది! అతని ఎడమచేయి అందుకు, దానికి నా కుడిచేయి ఆనించి, రెండుచేతులూ కలిపి దేవుడికి దణ్ణం పెట్టాను. ఆ క్షణంలో నాకళ్ళలో నీళ్ళు తిరిగినాయి. ఆరోజులు, ఆ సాన్నిహిత్యం, అదంతా క్రమంగా ఎప్పుడో కరిగిపోయినట్లుగా అన్పిస్తోంది నాకు.

నాకు తెలిసిన విజయ్! నేను కలలుకన్న విజయ్ వేరు. అతను సున్నితమైన స్వభావంకలవాడు. ఎదుటవారిని బాధపెట్టేవాడు కాదు. కానీ ఈ విజయ్ వేరు! ఇతను దేనికీ భయపడడు! వెరవడు! చివరికి, చివరికి నన్ను

నొప్పించే విషయాలైనా సరే! అతను లక్ష్యపెట్టడంలేదు! ఏదయినా అంటే ఎంతసేపూ డిసిప్లిన్! డిసిప్లిన్! ఈమాటతో నా ప్రాణం విసుగెత్తి పోతోంది!

ఇంటికివచ్చాం! సంజయ్ పక్కన నేను పడుకున్నాను. అవతల గదిలో విజయ్ మేలుకుని వున్నాడని తెలుసు! కానీ నాకెందుకో లేచి వెళ్ళాలని అనిపించలేదు. అతనికి, నాకూ మధ్య ఏదో దూరంలాటిది బాగా ఫీలవుతున్నాను నేను. నాకు విజయ్ కావాలి! నిజమే! కానీ అతనితోపాటు నా యిరుగు పొరుగు, బంధువులు, స్నేహితులు, అందరూ కావాలి! అతనికి వీరెవరూ కావాలో, అవసరం లేదో నాకు తెలియదు! కానీ డిసిప్లిన్‌మాత్రం కావాలి. అది చాలాముఖ్యం అతనికి! ఇది నాకు బాగా అర్థం కాసాగింది.

మర్నాడు సంజయ్‌కి బాగా జ్వరం వచ్చింది. సాయంత్రం అయ్యేసరికి జ్వర తీవ్రతతో కలవరించసాగాడు. మా వీధి చివర ఒక డాక్టర్ వున్నాడు. విజయ్ రాత్రి 9 గంటలవేళ వెళ్ళి ఆయనకి సంజయ్ పరిస్థితి చెప్పి చూడటానికి రమ్మన్నాడు. ఆ డాక్టరుగారి సంగతి మాకు తెలుసు. 9 గంటలు దాటితే, ఆయన భార్యతో క్లబ్‌కి వెళ్ళిపోవాల్సిందే! విజయ్ వెళ్ళేసరికి, ఆయన భార్యతోకలిసి క్లబ్‌కి వెళ్ళిపోతున్నాడట. ఇప్పుడు వీలుకాదు, రానని తిరస్కరించాడు.

విజయ్ చాలాకోపంగా యింటికి తిరిగి వచ్చాడు. సంజయ్‌కి ఆ రాత్రి చాలా సుస్తీ చేసింది. అర్ధరాత్రి 12 గంటలవేళ హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాం! నేను చాలా భయపడిపోయాను. అక్కడ సమయానికి వైద్యసహాయం దొరకటంతో సంజయ్ ప్రాణాలు దక్కినాయి. మేం డాక్టరు రాలేదు పోనీలే అదే తగ్గుతుందిలే అని యింట్లోనే వుంచుకున్నట్టయితే మాకు వాడు దక్కేవాడేకాదు.

సంజయ్ వారంరోజులకి కానీ కోలుకోలేదు. ఈలోపల విజయ్ వీధి చివరన డాక్టరుగారిమీద కేసు పెట్టాడు. సంజయ్‌తో హాస్పిటల్లో సతమతమౌతున్న నాకు రమణ వచ్చి యీ విషయం చెప్పేవరకూ, తెలియనే తెలియదు. ఈమాట వినగానే నేను నిర్ఘాంతపోయాను.

విజయ్‌ని మందలించాను. 'నీకేమైనా పిచ్చా! ఆయనేదో వీలుకాక రాలేదు. దానికి మనం గొడవచేస్తే ఏం బాగుంటుంది?'

'గొడవా! ఆయన డాక్టర్ వృత్తి అంటే గల్లాపెట్టె పెట్టుకునే వ్యాపారం అనుకుంటున్నాడు. మనం పలుకుబడి, డబ్బుగలవాళ్ళం కాబట్టి సంజూని దక్కించుకోగలిగాం! మన స్థానంలోనే అలాటి అండదండలులేని, ఏ మామూలువ్యక్తో వెళ్ళాడనుకో! ఆరోజు వాళ్ళకి బిడ్డ దక్కివుండేవాడా! అసలు వైద్యవృత్తిపట్ల పవిత్రమైన భావం, విశ్వాసం, సహనంలేనివాళ్ళు డాక్టర్లుగా రానేరాకూడదు! నేను చూస్తూనే వున్నాగా! వీళ్ళు డాక్టర్లులా లేరు. రోగాలు పీక్కుతింటున్నాయని భయపడి, జనం డాక్టర్లదగ్గరకి వెళితే డాక్టర్లే పీక్కుతింటున్నారు.'

'దీనివల్ల లాభం ఏమైనా వుంటుందా అసలు?'

'లాభం వుంటుందా లేదా అన్న ఆలోచన అనవసరం! యింకోసారి అయినా జాగ్రత్తగా వుంటాడు' విజయ్ వెళ్ళిపోయాడు.

ఇదంతా వింటున్న రమణ, బాధగా చూస్తూ, 'వదినా! అన్నయ్యకి మరీ యింత చాదస్తం ఎక్కువైపోయిందేమిటి?' అన్నాడు.

'అదే నాకూ బాధగావుంది! నేనెంత చెప్పినా వినరు' అన్నాను.

కోర్టులో కేసు చాలాకాలం నడిచింది! ఎదుట ప్లీడరు ఎప్పుడూ వాయిదానే అడిగేవాడు. చివరికి ఆ డాక్టరుగారికి ఎలాటి శిక్షపడలేదు. డాక్టరు కూడా మానవమాత్రుడే అంటూ జడ్జీగారు కేసుకొట్టేశారు. మాకు మాత్రం ప్లీడర్ ఫీజు వేయిరూపాయలు పైగా అయింది.

'ఎందుకొచ్చిన గొడవ యిది' అన్నాను.

'నీకు గొడవగా వుందేమో! నాకు ఒక అన్యాయాన్ని ఎదుర్కొన్నాను అనే సంతృప్తి వుంది' అన్నాడు విజయ్.

ఇతనికి ఇంక నేనేం చెప్పినా అర్థంగాదు. అతని స్వభావం మారదు అనిపించింది.

విజయ్ ప్రభుత్వందగ్గర గ్రాంట్ తీసుకుని కోఠీ సెంటరులో 'ఎక్స్ జవాన్ టీ స్టాల్' ఓపెన్ చేశాడు. అది రెండునెలల కంటే ఎక్కువ నడవ

లేదు! దానికికూడా విజయ్ స్వభావమే బెడిసికొట్టింది! టీ తాగటానికివచ్చిన వాళ్ళు టీ తాగిన వెంటనే లేచి వెళ్ళిపోరు! ఏదో ఒకటి పిచ్చాపాటి మాట్లాడుతారు! విజయ్ వాళ్ళని లేచిపొమ్మనేవాడు. టీస్టాల్‌లో అడుగు పెట్టగానే, 'కబుర్లలో కాలక్షేపం చే[illegible]! అరువులేదు. ఎక్కువశబ్దం చేయరాదు' అని తాటికాయంత [illegible]లు, వచ్చినవాళ్ళు కనుబొమలెత్తి చూసేలా చేసేవి!

టీస్టాల్ మూతపడిననాటినుంచి, విజయ్ మళ్ళీ బాగా డ్రింక్‌కి అలవాటుపడ్డాడు. అతనిచేత అది మానిపించాలని నేను చేసిన ప్రయత్నాలన్ని వ్యర్థమైనాయి. 'నన్ను తాగవద్దని అనకు రాధా! నువ్వు వద్దంటే, నీకు తెలియకుండా తాగాల్సివస్తుంది! ప్లీజ్! నీ ఎదుట అబద్ధం చెప్పేఖర్మ నాకు పట్టించకు! నేను తాగకుండా వుండలేకపోతున్నాను!' అర్థింపుగా అన్నాడు. నేను మాట్లాడలేకపోయాను.

ఆ తాగుడు, ఆ నిస్పృహ రెండుమూడురోజులే! మళ్ళీ మామూలుగా అయిపోయేవాడు! రెట్టింపు వుత్సాహంగా వున్నట్లు ప్రవర్తించేవాడు! జోక్ చేసేవాడు. నాకు అమ్మయ్య అనిపించేలోపలే ఏదో ఒకటి జరిగిపోయేది!

ఆరోజు నేను కాలేజీనుంచి ఆలస్యంగా యింటికి వచ్చాను. మర్నాటినుంచి, నాకు కాలేజీకి శెలవలు! నేను ఎంతో సంతోషంగా, మనసు నిండా శెలవలు ఎలా గడపాలా అని ఎన్నో ప్లాన్‌లు పెట్టుకుని యింటికి వచ్చాను.

నేను యింటికి వచ్చేసరికి, విజయ్ సోఫాలో పడుకునివున్నాడు. అతనికి నుదుటికి కట్టువుంది.

'ఏమిటిది! ఏమైంది?' గభాల్న దగ్గరకి వస్తూ అడిగాను.

'చిన్నకొట్లాట జరిగింది.'

'కొట్లాట!' నేను గుండెలమీద చేతులు ఆనించుకున్నాను.

'భయపడకు, మధ్యాహ్నం బజారు వెళ్ళాలని నేను బస్‌స్టాప్‌దగ్గర నిలబడివున్నాను. మధ్యాహ్నంకదా! రోడ్డుమీద జనం ఎక్కువలేరు. అక్కడ

ఒక ఆడపిల్ల బస్‌కోసం నిలబడి వుంది. నలుగురు మగపిల్లలు చేరారు! పాపం ఆ అమ్మాయి తలెత్తలేదు. వాళ్ళవైపుకూడా చూడలేదు. వాళ్ళు ఆ అమ్మాయి గురించి అసభ్యంగా మాట్లాడుతూ జోక్ చేయసాగారు. నేను వినలేకపోయాను. ఆ అమ్మాయి కళ[illegible] పర్యంతం అవుతోంది. కాగితం వుండలుచుట్టి ఆ అమ్మాయిమీద [illegible]రు. ఆ అమ్మాయిని కవ్వించి, ఏదయినా అంటే గేలి చేయాల[illegible] చూస్తున్నారు. నాకు మండిపోయింది. వెళ్ళి చితకబాదాను. వాళ్ళూ నన్ను కొట్టారు. గాయం అయింది. నాకు కొస్త రక్తం వచ్చింది! కానీ వారిలో ఒకడికి నాచేతిలో పళ్ళే వూడినాయి. ఈరోజు నాకు రెండుచేతు లుంటేనా, వాడి రక్తం కళ్ళచూసివుండేవాడిని' నేను నిర్ఘాంతపోయి చూస్తున్నాను.

'బజారులో అక్కడ ఇంకెవ్వరూలేరా?' అన్నాను.

'ఉన్నారు! కానీ ఎవ్వరూ పట్టించుకోవటంలేదు. నాకు ఆశ్చర్యం వేసింది! చూస్తూ వూరుకున్నారు. వాళ్ళసలు మగాళ్ళేనా అనిపించింది. పాపం! ఆడపిల్ల తనదారిని తనుపోతూ, బస్‌కోసం నిలబడితే అంత అల్లరి చేస్తాడా! పనిలేనిపెధవ!' విజయ్ పళ్ళు బిగించాడు.

నేను నిట్టూర్చాను.

ఆ రాత్రి విజయ్‌కి ఒళ్ళు నొప్పులు ఎక్కువైతే నేను వేణ్ణీళ్ళలో గుడ్డముంచి కాచాను.

'విజయ్! ఇదంతా నీకెందుకు? ఎందుకిలా అన్నీ నెత్తిన వేసుకుంటావు!' అన్నాను.

'నెత్తిన వేసుకున్నానా! అన్యాయం జరుగుతుంటే చూస్తూ వూరుకోమంటావా? నావల్లకాదు' అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. అతనితో తర్కించి లాభంలేదు.

విజయ్ బస్‌స్టాప్‌దగ్గర చావగొట్టిన స్టూడెంట్ మా పక్కవీధిలో అతనేనని నాకు తర్వాత తెలిసింది. అతను మామీద బాగా పగబట్టాడు. నేను వస్తూంటే వెళుతుంటే వెకిలిచేష్టలు. అసహ్యమైన మాటలు మొదలు

పెట్టాడు. ఈరోజుల్లో స్టూడెంట్స్‌తో పేచీ అంటే, కొరివితో తల గోక్కున్నట్టే!

ఒకరోజున మేం సినిమాకి వెళ్ళి వచ్చేసరికి మా యింటిముందున్న తోట అంతా ధ్వంసం అయివుంది! మా యింటి అద్దాలతలుపులు బద్దలయి పోయినాయి. గోడలమీద బొగ్గుతో వికారంగా, విజయ్ ఆకారం కుడిచేయి లేకుండా వేసివుంది. దానిక్రింద 'మిష్టర్ డిసిప్లిన్! గెటవుట్ ఫ్రమ్ అవర్ లోకాలిటీ' (క్రమశిక్షణా! మా వీధినుంచి వెళ్ళిపో) అని వ్రాసివుంది.

చిత్రంగా అదిచూసి విజయ్ మండిపడలేదు. 'ఏడిశారు వెధవలు. డర్టీ రాస్కెల్స్. నన్నేం చేయలేని దద్దమ్మలు. నా ఎదురుగా రాలేక, ఇలా పక్కచాటుగా చేశారు' అన్నాడు. ధ్వంసమైన ఆ తోటని, ఆ పగిలిన అద్దాలని చూసేసరికి నా నడుం విరిగినంత పనైంది. అవి సరిచేయాలంటే మళ్ళీ ఎంత ఖర్చు! ఎంత శ్రమ!

తోటని సరిచేసుకున్నాం, డబ్బు ఖర్చు పెట్టి అద్దాలతలుపులు బాగు చేయించుకున్నాం! కానీ అంతటితో మా కష్టాలు తీరలేదు.

నేను బజారు షాపింగ్‌కని వెళ్ళాను. కారు పార్కుచేసి షాపులోకి వెళ్ళి గంటతర్వాత తిరిగి వచ్చేసరికి, నా కారులేదు. ఎవరో ఎత్తుకుపోయారు. నేను యింటికివచ్చి చెప్పగానే విజయ్ పోలీసు రిపోర్ట్ యిచ్చాడు.

రెండురోజుల అనంతరం, నాకారు అద్దాలు పగిలి, సీట్లు చిరిగి, ఒంటినిండా సొట్టలతో, లైట్లు తుక్కు అయి పబ్లిక్‌గార్డెన్‌లో ఒక చెట్టు క్రింద దొరికింది. ఎవరో గిట్టనివాళ్ళు చేసినట్లుగా పోలీసులు అని కేసు నమోదు చేయలేదు. విజయ్ ఆ స్టూడెంటేనని చెప్పాడు. ఆధారం లేదని తోసిపుచ్చారు వాళ్ళు.

నేను యిక భరించలేకపోయాను. ఇంటికి రాగానే విజయ్ పోలీసు అధికారులమీద ఎలా ఎవరికి ఫిర్యాదు చేయాలి అని ఆలోచిస్తుంటే నేను అరిచినట్లుగా అనేశాను, 'అబ్బబ్బా! ఇంక యిప్పటికన్నా నీ డిసిప్లిన్ ఆపు. నీ డిసిప్లిన్‌వల్ల జరిగిన అనర్థాలు చాలలేదా! మనం ఇంత నష్టపోయినా, నీ కళ్ళు తెరిపిడిపడటంలేదా! కనీసం ఇప్పుడైనా అర్థం చేసుకుంటావా

అందరూ కళ్ళువుండికూడా లేనివాళ్ళలా ఎందుకు చేస్తున్నారో! నోరు వుండికూడ మూగవాళ్ళు ఎందుకు అవుతున్నారో! నువ్వు డిసిప్లిన్ అంటూ వీధిలోపోయే తద్దినాల్ని ఇంటికి తీసుకువచ్చావు! ఎవరికి ఇదంతా భరించే సహనం, శక్తి, తీరుబడి వుంది అంటావు! అందుకే తనవరకూ రానంత వరకూ పట్టించుకోలేని ధోరణి అందరూ అలవాటు చేసుకుతున్నారు. ఇప్పుడైనా ఒప్పుకుంటావా!'

'రాధా! నాన్సెన్స్ మాట్లాడకు! ఎక్కడో ఎవరో ఒకరైనా తెగించి ధైర్యం చేయకపోతే, ఇవి తామరతంపరలా అందరికీ చుట్టుకుంటాయి! అందరిలో, మనం ఎక్కడ నష్టపోతామోననే ఆ స్వార్థం బలిసిపోబట్టే, దేశం యిలా అధోగతి అవుతుంది! అందరూ ఒకేరకంగా ప్రవర్తిస్తే, ఈ అరాచకానికి చోటే వుండదు! బెదిరించేవాళ్ళు, అడ్డునిలిచేవాళ్ళు లేకపోతే, దుర్మార్గులకి యింకా అలుసు అవుతుంది. అమాయకుల్ని ఇంకా ఏడిపిస్తారు. అందరి సంగతి నాకువద్దు. నాకంఠంలో ప్రాణం వుండగా, నేను రాజీపడను. పోరాడుతూనే వుంటాను. భగవాన్! నాకున్నది ఒక్కటే చెయ్యి అయినా, వందచేతులు వున్నట్టుగా పోట్లాడగలను! నాకున్నది భుజబలంకాదు. ఆత్మ విశ్వాసం! మనోబలం.'

'ఆ పోట్లాడతావు! పోట్లాడే మొనగాడు వచ్చాడు. అందుకే దేవుడు ఒక చేయి నరికేసి అవిటివాడిని చేశాడు. అసలు నువ్వు యుద్ధంనుంచి తిరిగి రాకుండా వుంటే బాగుండేది.'

నా వాక్యం పూర్తికాలేదు. నా చెంప ఛెళ్ళుమంది. నేను నిరుత్తరు రాలినయినట్టు చూస్తున్నాను.

విజయ్ కళ్ళలో నిప్పులు రాలుతున్నాయి. 'నువ్వు-నువ్వు నన్ను వెక్కిరిస్తున్నావా' అతని చెయ్యి మళ్ళీ లేవబోయి ఆగిపోయింది. 'ఇంకోసారి ఆ మాట అన్నావంటే నిన్ను షూట్ చేస్తాను జాగ్రత్త'. అతను అక్కడ నుంచి మెరుపులా వెళ్ళిపోయాడు.

నేను చాలా తొందరపడినమాట నిజమే! కానీ నాబాధ అలాటిది. నా బాధ ఏమిటో అతనికి అర్థంకాదు. నేనేం చెయ్యను.

నేను కాలేజీకివెళ్ళి సుమిత్రదగ్గర కూర్చుని కావాలనే తిరిగివస్తూ దుర్గదగ్గర ఆగాను. దుర్గ కుతూహలంగా చూసింది. మనసులో ఏమున్నా పైకి బాగానే మాట్లాడింది. సంజయ్‌ని అక్కడ నిద్రపుచ్చి నేనింటికొచ్చాను.

నేను వచ్చేసరికి తలుపులు తీసే వున్నాయి. లైట్లు వేసివున్నాయి. సోఫాలో విజయ్ పడివున్నట్టుగా పడుకొని వున్నాడు. అతను బాగా తాగాడని అక్కడున్న ఖాళీసీసాలే చెబుతున్నాయి! అతనిదగ్గరగా నేలమీద జానీ కూర్చుని వుంది. అతను దానితలని నిముగుతున్నాడు. నేను అతన్ని చూసీ చూడనట్టు వెళ్ళిపోయాను. అసలే మొండి! అందులో బాగా డ్రింక్ చేసి వున్నాడు. ఇప్పుడు గొడవ మొదలుపెడితే అతన్ని నేను ఆపలేను.

నేను వెళ్ళి గదిలో పడుకున్నాను! నా మనసంతా భయంకరమైన ఒంటరితనంతో నిండిపోయింది. ఇదివరకు ఒంటరితనంలో నాకు విజయ్ గురించిన ఆలోచనలు తోడుగా వుండేవి. అందులో నాకు ఒదార్పు వుండేది. ఇప్పుడు నా కెవ్వరూ లేనట్టుగా అన్పిస్తోంది. విజయ్‌కి, నాకూ మధ్య అంతు లేని అఘాతం కన్పిస్తోంది. ఇది పూడేట్టులేదు. విజయ్ నన్ను పిలవలేదు.

హుఁ! ఎంతచిత్రం! ఇదివరకు విజయ్ వేలమైళ్ళ దూరంలోవున్నా, నాదగ్గరగా వున్నట్టు ఫీలయ్యాను. ఇప్పుడు అతను నా పక్కగదిలోనే వుంటున్నాడు. అయినా వేలమైళ్ళ దూరంలో వున్నట్టుగా వుంది. జీవితం ఎంత తమాషా అయింది.

మర్నాడు లేచాను. త్వరత్వరగా నా పనులు పూర్తిచేసుకున్నాను. అతనికి కాఫీ ఇస్తే అందుకోకుండా 'సంజూ ఏడి?' అని అడిగాడు.

'రమణదగ్గర వదలి వచ్చాను. మన పోట్లాటమధ్య వాడు నలిగి పోవటం నాకిష్టంలేదు. కొన్నాళ్ళపాటు అక్కడే వుంటాడు, ఇక్కడికి రాడు.'

'అంతా నీ పెత్తనమేనా?'

'ఇంటి బాధ్యత అంతా నెత్తిన వేసుకోగా లేనిది, పెత్తనం తీసుకుంటే తప్పేమిటో!'

విజయ్ కాఫీకప్పును ఒక్కతోపు తోశాడు. 'నన్ను షూట్ చేయటానికి ఇన్ని మాటలెందుకు! ఒక్క తూటా చాలు. వెళ్ళు, నా పెట్టెలో వుంది. తెచ్చుకో రివాల్వర్.'

'అది నీకు వచ్చిన విద్య! మనుష్యుల్ని చంపటంలో ఆరితేరిన వాడివి! నువ్వే చెయ్యాలి! బాధ కలిగితే ప్రాణాలు తీయటంకాదు, తీసుకోవటమే తెలుసు నాకు. ఆ పనే ఎప్పుడో చేస్తాను. అప్పుడు నువ్వు సుఖంగా, బాగా ఆనందంగా వుందువుగాని' ఆవేశంగా అన్నాను. నాకు ఏడుపు వచ్చేసింది. ఎన్నాళ్ళనుంచో ఈ వేదన పడ్తున్నాను. ఇక భరించ లేనని అనిపిస్తోంది.

నేను అరగంటలో కాలేజీకి వెళ్ళిపోయాను.

మధ్యాహ్నం, నేను కాలేజీనుంచి రాబోతుండగా రమణ పరుగెత్తుకు వచ్చాడు! 'వదినా! అన్నయ్యని హాస్పిటల్లో చేర్పించాను, త్వరగా రా.'

'ఏమిటి? ఏమైంది!'

'షూట్ చేసుకున్నాడు! పనిమనిషి వచ్చి చెబితే వెళ్ళాను' నా కళ్ళు గిర్రున తిరిగాయి. కాళ్ళక్రింద భూమి తేలిపోతున్నట్లుగా వుంది. రమణ చెయ్యి గట్టిగా పట్టుకున్నాను.

రమణ వచ్చిన టాక్సీలోనే హాస్పిటల్‌కి పరుగెత్తాం! డాక్టర్లు ఆపరేషన్ చేస్తున్నారు. చెప్పలేమంటున్నారు. రక్తం కావల్సి వచ్చింది. రమణ తను యిస్తానంటున్నాడు. నాకు యివేం వినిపించటంలేదు. ఆపరేషన్ చేసి గుళ్ళు తీసేశారు. ఎడమచేత్తో కాల్చుకోవడంవల్ల గురి సరిగ్గా కుదరలేదు. కాకపోతే అప్పటి కప్పుడే ప్రాణం పోవాల్సింది. రమణ జేబునుంచి ఒక వుత్తరం తీసి యిచ్చాడు. 'వదినా యింట్లో అన్నయ్యప్రక్కన దొరికింది. నీకే' అన్నాడు.

నేను అది తీసుకుని చదవసాగాను. విజయ్ వ్రాసాడు.

"రాధా !

ఈరోజు నువ్వు మాటలతో నన్ను షూట్ చేసి వెళ్ళిపోయావు. నే నిప్పుడు జీవచ్ఛవాన్ని ! జీవితంమీద ఇచ్ఛ లేనిమనిషి ఏం చేస్తాడో నీకు తెలుసు. రాధా ! ఇక నేను నీకు కనిపించను. నీమాటలనుబట్టి నేను నిన్ను చాలా బాధపెట్టాననే అనుకుంటున్నాను. నేను యుద్ధంలో గెలిచినా ఇక్కడ చిత్తుగా ఓడిపోయాను. నేనేం చేశాను ? నా నేరం ఏమిటి ? మీరంతా కలసి నన్ను ఎందుకిలా దోషిలా చేశారు ? ఎందుకు అంటరానివాడిగా చూస్తు న్నారు ? నేను డిసిప్లిన్ పాటించాను. అంతేగా ? ఈ డిసిప్లిన్‌వల్ల మనిషి తనకి తనకే కాకుండా ఎదుటవారికికూడా ఎంత సుఖపెడ్తాడో మీకు తెలీదు.

నేను అవిటివాడిని నిజమే ! కానీ ఇంతక్రితం నీ నోటినుంచి ఆమాట వినేవరకు, దాన్ని గురించి నాకు బాధ కలుగలేదు. ఇప్పుడు నేను శారీరకం గానే కాదు, మానసికంగాకూడా అవిటివాడినే ! నువ్వన్నది అక్షరాలా నిజం. నేను ఎంత పోరాడుతానో అని భయంవేసి భగవంతుడు నాచెయ్యి తెగ్గొట్టేసినట్లున్నాడు. రాధా ! నేను ఎంతో ఆశతో తిరిగివచ్చాను. నాకు నువ్వు వున్నావనే నమ్మకంతో వచ్చాను. వచ్చినప్పటినుంచీ జరిగిందేమిటి ? ఒక యుద్ధం వదిలేసి వచ్చిన నేను, ఇంకో యుద్ధం ఎదుర్కోవాల్సి వచ్చింది. మొట్టమొదట సంజయ్‌తో ! వాడు నన్ను ద్వేషించకుండా తండ్రిగా గుర్తించేటట్లు చేసుకోవటం ఒక పెద్దబాధ అయింది. తర్వాత నీతో రాజీ పడటం ! నేను లేకుండా మూడున్నర సంవత్సరాలు గడిపిన నీ జీవితం ఇంకెవరెవరితోనో పెనవేసుకుంది. అది ఛేదించి నిన్ను సొంతం చేసుకోడం సామాన్యమైనపని కాదు. తర్వాత ఫైనాన్షియలుగా ! నేను అహాన్ని చంపుకుని రాజీపడటం, ఇవన్నీ ఒక ఎత్తు ; ఈ డిసిప్లిన్ విషయంలో పోరాటం ఇంకో ఎత్తు. క్రమశిక్షణ, బాధ్యత అనేవి నా నరనరంలోనూ జీర్ణించిపోయినాయి. అవి అంటే ఏమీ తెలియని ప్రపంచంలో వచ్చిపడ్డ నేను తట్టుకోలేక పోతున్నాను. ఒక్కసారి నువ్వు నావైపు ఆలోచించి చూడు. నేను మూగగా

చేస్తున్న యుద్ధం నీకు అర్థం అవుతుంది. నేను ఈ సొసైటీలో ఎందుకూ పనికిరానివాడిగా, అర్హత లేనివాడిలా అయ్యాను. అందుకే ఈ సొసైటీ నన్ను వెలివేసింది! కానీ ఆ సొసైటీ నీకు కావాలి. ఇది మనిద్దరిమధ్యా యుద్ధం అయిపోయింది. రాధా! నేను అలిసిపోయిన సైనికుడిని. నా క్రమశిక్షణ ఈ సొసైటీకి నచ్చదు. బాధ్యతలేని బేవర్స్‌గా, జల్సాగా, జులాయిగా తిరిగే ఈ సొసైటీ నాకు నచ్చదు. మరి నేను జీవించడం ఎలా? అసలెందుకు జీవించాలి? ఎవరిని సుఖపెడుతున్నానని! నేను ఒక్కోసారి ఎంత బెంబేలు పడుతున్నానో నీకు అర్థంగావటంలేదు. ఎందుకంటే నువ్వుకూడా వాళ్ళలో మనిషివే కాబట్టి. నీ బలం నాకుంటే నేనెంతయినా పోరాడగలను. నాకు నువ్వు లేవని తెలిసిన క్షణంలోనే నా ఆయువుపట్టుకి దెబ్బ తగిలింది. ఇంతక్రితం నువ్వు అన్నమాట ఎంతనిజం! బాధ కలిగితే మన ప్రాణాలే మనం తీసుకోవాలి. ఎదుటవాళ్ళ ప్రాణాలు తీయకూడదు. నిజం! ముమ్మాటికీ నిజం! అందుకే నేనీ పనికి తలబడుతున్నాను. నారాధ, నాకోసం ఆలోచించే రాధ, నాకోసం కలలుకనే రాధ ఏదీ? నీలో ఏమాత్రం లేదనిపిస్తోంది. నేను చాలా నిస్పృహకి గురి అయ్యాను. నేను నీకు అర్థంగానట్టే నువ్వుకూడా నాకు అర్థం గావటంలేదు.

రాధా! ఒకటి మాత్రం నిజం. ఈ ప్రపంచంలో మంచి అనే దాని ప్రాణం చాలా సుకుమారం. దాన్ని ప్రతిమనిషి జాగ్రత్తగా కాపాడాలి. లేకపోతే ఈ సంఘం రాక్షసుల మయంగా అయిపోతుంది. నాకు చేతనైనంత వరకూ ఒకరికి తలవంచకుండా చేశాను. ఆ తృప్తి ఒక్కటే నాకు మిగిలిపోతుంది. నేను పిరికితనంతో ఆత్మహత్య చేసుకోవటంలేదు. నా కిక్కడ పనిలేదు. నేను పనికిరానివాడిని కాబట్టి వెళ్ళిపోతున్నాను. నువ్వన్నమాటే శూలంలా పొడుస్తోంది. నిజమే నేను తిరిగి రాకుండా వుంటే ఎంత బాగుండేది? సారీ రాధా! ఐయామ్ వెరీ వెరీ సారీ. క్షమించు.

విజయ్."

ఆ వుత్తరం చూస్తూ రమణ అన్నాడు –

'అన్నయ్య ఏం వ్రాశాడు ?'

'చూడు' చదవమని యిచ్చాను.

రమణ చదివాడు. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ, 'అన్నయ్యని మనం అర్థం చేసుకోలేదు వదినా! వాడికి మనం అండగా వుండాల్సిందిపోయి ఒంటరివాడిని చేశాం.'

'రమణా! ఇలాంటి సైనికుల్ని మనం రక్షించుకోవాలిగదా! నీతి కోసం, నిజాయితీకోసం, క్రమశిక్షణకోసం పోరాడేవాళ్ళు మనకి ఎంతో అపురూపంకదూ!' జీరపోయిన గొంతుతో అన్నాను.

అవునన్నట్టు తలవూపాడు రమణ.

డాక్టరు వస్తూంటే లేచి నిలబడ్డాం.

'యూ ఆర్ లక్కీ మేడమ్! ఆయన గండంగడిచింది. ప్రాణానికి పర్వాలేదు' అన్నాడు.

'థ్యాంక్ యూ సర్! థ్యాంక్ యూ!' వణుకుతున్న కంఠంతో అన్నాను.

'నేను, రమణ విజయ్ గదిలోకి వెళ్ళాం. అతనికి ఇంకా స్పృహ రాలేదు. నేను కళ్ళనీళ్ళతో అతనిముఖం చూస్తూ అనుకున్నాను. 'విజయ్ నీ ప్రాణం నిలిపి భగవంతుడు నన్ను క్షమించాడు. నువ్వుకూడా నన్ను క్షమించు. నేను అమాయకంగా, మూర్ఖంగా, పిరికిదానిలా ప్రవర్తించాను. యింకెప్పుడూ అలా చేయను. ఇకనుంచీ నేనుకూడా నీతో కలిసిపోరాడుతాను. సంజయ్‌నికూడా ఆయత్తం చేస్తాను. నువ్వు ఇక ఎప్పుడు ఒంటరివాడివి కాదు. నీ అండగా మేం వున్నాం' అనుకోసాగాను.

ఆ క్షణంలో నాకెంతో ధైర్యం వచ్చింది. విజయ్‌కి నేను యిప్పుడు నిజమైన భార్యగా నిలబడగలను అనుకున్నాను. ఆ విశ్వాసం నాకు వేయి ఏనుగుల బలం తెప్పించినట్టుగా అయింది.

శ్రీనివాసా బుక్ స్టాల్
ప్రొ॥ కె. యస్. శ్రీనివాస్
మొగల్తూరు. బుక్ సీ నెం. 105